RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

హైదరాబాద్ 01 జూన్ 2026 సోమవారం పేజీలు:12 వెల రూ.2.00 సంపుటి:22 సంచిక:1

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS
We undertake Printing of Daily News Papers

## కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాకు సీఎం రేవంత్ రెడ్డి

**కొత్తగూడలో సామూహిక గృహప్రవేశాలు.. రెండో విడత ఇందిరమ్మ ఇళ్లకు శ్రీకారం**

**ఏర్పాట్ల పర్యవేక్షణకు వందే భారత్‌లో కాగజ్‌నగర్‌కు చేరుకున్న మంత్రి జూపల్లి**

**తోటి ప్రయాణికులతో మంత్రి ముచ్చట్లు.. రైలులోనే భోజనం**



హైదరాబాద్, మే 31:పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం మరో కీలక ఘట్టానికి చేరుకోనుంది. తొలి విడత ఇళ్ల నిర్మాణం పూర్తయి లబ్ధిదారులు గృహప్రవేశాలకు సిద్ధమవుతుండగా, రెండో విడతకు కూడా ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సోమవారం కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.

కొత్తగూడలో తొలి విడత కింద నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో కలిసి ముఖ్యమంత్రి సామూహిక గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొననున్నారు. అనంతరం కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్డు వద్ద నిర్వహించే భారీ బహిరంగ సభలో రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది పేద కుటుంబాలకు గూడు కల్పించే దిశగా ఈ కార్యక్రమం మరో ముందడుగుగా నిలవనుంది.

ఈ నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరిన సాయంత్రం కాగజ్‌నగర్‌కు చేరుకున్నారు.

రైలు ప్రయాణం సందర్భంగా మంత్రి జూపల్లి తోటి ప్రయాణికులతో ముచ్చటించారు. వందే భారత్ ట్రైన్ లో మధ్యాహ్న భోజనం చేశారు

ముఖ్యమంత్రి పర్యటన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేపట్టింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

మరికాసేపట్లో సభా ప్రాంగణం, పార్కింగ్ ప్రాంతాలు, హెలిపాడ్, వేదిక ఏర్పాట్లు, సదుపాయాలను మంత్రి క్షేత్రస్థాయిలో పరిశీలించనున్నారు. అనంతరం జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు.

ఇందిరమ్మ ఇళ్ల తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల ఇళ్ల నిర్మాణ ప్రక్రియ ప్రారంభమై వేగంగా కొనసాగుతోంది. రెండో విడతలో మరో 2.50 లక్షల ఇళ్ల నిర్మాణాన్ని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించుకుంది. పేద కుటుంబాలకు గౌరవప్రదమైన జీవనం, సొంతింటి భరోసా కల్పించాలనే సంకల్పంతో ముందుకు సాగుతున్న ఈ పథకానికి కుమ్రం భీం-ఆసిఫాబాద్ జిల్లా వేదిక కావడం ప్రాధాన్యత సంతరించుకుంది. రాష్ట్రవ్యాప్తంగా రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి ఈ జిల్లా నుంచే ముఖ్యమంత్రి శ్రీకారం చుట్టనుండటంతో ప్రభుత్వ గృహ విప్లవంలో ఇది మరో చారిత్రక ఘట్టంగా నిలవనుంది.





హైదరాబాద్ మీదుగా గుల్బర్గా కు వెళ్తున్న ఏఐసీసీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ని మర్యాదపూర్వకంగా కలిసిన సీఎం రేవంత్ రెడ్డి , ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ , టిపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్ రావ్, ఏఐసీసీ కార్యదర్శి సంపత్ కుమార్ తదితరులు

## స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం

వార్తా 2 లో

## కాళేశ్వరం విచ్చేసిన పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు



సరస్వతి అంత్య పుష్కరాల సందర్భంగా 11వ రోజు ఆదివారం కాళేశ్వరం విచ్చేసిన పూజ్య శ్రీ మాధవనంద సరస్వతి స్వామీజీని రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రులు స్వామీజీ ఆశీస్సులు పొందారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే మక్కన్ సింగ్ ఠాకూర్ గారు, సీడబ్ల్యూసీ సభ్యులు గొడుగు రుద్రరాజు పాల్గొన్నారు. పుష్కరాల సందర్భంగా భక్తులకు కల్పిస్తున్న సౌకర్యాల పట్ల స్వామీజి రాష్ట్ర ప్రభుత్వాన్ని అభినందించారు.11వ రోజు కాళేశ్వరానికి పెద్ద సంఖ్యలో భక్తులు విచ్చేసి పుష్కర స్నానాలు ఆచరించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, పుష్కరాలు ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాధాన్యం కలిగినవని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని పవిత్ర స్నానాలు చేయడం ఆనందదాయకమని తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం అన్ని విధాలుగా ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు.అదేవిధంగా, స్వామీజీ రాష్ట్రం మరియు దేశ ప్రజల సౌభాగ్యంకోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఆదివారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, వారి కుటుంబ సభ్యులు. ఈ సందర్భంగా శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## మంథని బస్టాండ్‌లో రూ.93 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు

**= గోదావరి పుష్కరాలు--2027కు భారీ స్థాయిలో ప్రత్యేక రవాణా సదుపాయాలు**





**పెద్దపల్లి, మే-31, ప్రజాబలం ప్రతినిధి :** మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధితో ప్రజా రవాణా సేవలు మరింత మెరుగుపడతాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. మంథని మున్సిపాలిటీ పరిధిలోని మంథని బస్టాండ్‌లో రూ.93 లక్షల వ్యయంతో చేపట్టనున్న అదనపు ప్లాట్‌ఫారాలు, ఇతర అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఐటీ, పరిశ్రమలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష లతో కలిసి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ మంత్రి శ్రీధర్ బాబు సూచనల మేరకు మంథని, కాళేశ్వరం బస్టాండ్ల అభివృద్ధికి అవసరమైన నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. గోదావరి పుష్కరాలు--2027 నిర్వహణ కోసం ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించిందని, కుంభమేళాను తలపించే స్థాయిలో పుష్కరాలు నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ సిద్ధం చేస్తున్నామని చెప్పారు. కోట్లాది మంది భక్తులు పుష్కరాలకు తరలి వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి గ్రామం నుంచి పుష్కర క్షేత్రాలకు చేరుకునేలా ప్రత్యేక రవాణా సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. బాసర నుంచి భద్రాచలం వరకు బస్టాండ్లను ఆధునికీకరించడంతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. సమ్మక్క--సారలమ్మ జాతరకు ఏర్పాటు చేసిన తరహాలోనే పుష్కరాల సందర్భంగా ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామని తెలిపారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, గుర్తింపు సంఘాల ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు. కార్మికులు అపోహలు నమ్మవద్దని మంత్రి సూచించారు. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మాట్లాడుతూ మంథని బస్టాండ్‌లో రెండు అదనపు ప్లాట్‌ఫారాల నిర్మాణానికి రూ.74 లక్షలు, ఇతర అభివృద్ధి పనులకు రూ.19 లక్షలు మంజూరు చేసినట్లు తెలిపారు. కాళేశ్వరం బస్టాండ్ అభివృద్ధికి రూ.3 కోట్లు మంజూరు చేశామని, కాళేశ్వరం దేవస్థాన అభివృద్ధిలో ఆర్టీసీ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. దశాబ్దాలుగా ప్రజల ఆకాంక్షగా ఉన్న పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటు త్వరలోనే సాకారం కానుందని, మంథని బస్టాండ్ ఆధునికీకరణతో పాటు పెద్దపల్లి బస్ డిపోను కూడా త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు. ఆర్టీసీ కార్మికుల ఎన్నో ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఉప ముఖ్యమంత్రి నాయకత్వంలో రవాణా శాఖ మంత్రి, ఇతర మంత్రులతో కలిసి చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. కార్మిక సంఘాల గుర్తింపు ఎన్నికల అనంతరం కార్మిక ప్రతినిధులతో చర్చించి ఆర్టీసీ విలీన ప్రక్రియను ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ ,రీజనల్ కరీంనగర్ మేనేజర్ రాజు, డిప్యూటీ ఆర్.యం.(ఎం) మల్లేశం, డిపో మేనేజర్ శ్రావణ్ కుమార్, ఆర్డిఓ సురేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు, ఆర్టీసీ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాబలం

01 జూన్ 2026 సోమవారం


# డేటా సెంటర్లు వెనుక రెండో కోణం...

ప్రస్తుత ప్రపంచంలో కృత్రిమ మేధ మౌలిక సదుపాయాలు కూడా రహదార్లు, ఓడరేవుల వంటి వ్యూహాత్మక జాతీయ ఆస్తులుగా మారుతున్నాయి. ఇటీవల విడుదలైన ఒక నివేదిక ప్రకారం, రాబోయే ఐదేళ్లలో భారతదేశంలోని డేటా సెంటర్లలో దాదాపు 7 లక్షల గ్రాఫిక్స్ ప్రాసెసింగ్ యూనిట్లను మోహరించే అవకాశం ఉంది. ఇది దాదాపు 23 బిలియన్ డాలర్ల పెట్టుబడి అవకాశాన్ని సృష్టిస్తుంది. దేశంలో ఎఐ స్వీకరణ, డేటా సెంటర్ల విస్తరణ అనేది ఒక భారీ ఆర్థిక అవకాశాన్ని తెరిచింది. 2025 లో 1.6 గిగావాట్ల (జిడబ్ల్యు)గా ఉన్న భారత్ నిర్మిత డేటా సెంటర్ సామర్థ్యం, 2030 నాటికి దాదాపు 5 జిడబ్ల్యుకు చేరుకుంటుందని అంచనా. దీని వలన దాదాపు 25 బిలియన్ డాలర్ల మూలధన పెట్టుబడి అవసరమవుతుంది. 2024లో 10 బిలియన్ డాలర్లుగా ఉన్న భారతదేశపు ఎఐ మార్కెట్, 39 శాతం సమ్మేళన వార్షిక వృద్ధిరేటు (సిఎజిఆర్)తో 2032 నాటికి 131 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని భావిస్తున్నారు. ఇతర అంచనాల ప్రకారం, కృత్రిమ మేధ భారత ఆర్థిక వ్యవస్థకు 2035 నాటికి 1.7 ట్రిలియన్ డాలర్లను జోడించగలదని ప్రభుత్వ అంచనా:

ప్రస్తుతం భారతదేశపు టెక్నాలజీ రంగంలో 60 లక్షల మందికి పైగా ఉపాధి పొందుతున్నారు. గత పార్లమెంట్ సమావేశాల్లో ప్రభుత్వం వెల్లడించిన వివరాల ప్రకారం, 2024లో ప్రారంభించిన 'ఇండియా ఎఐ మిషన్' కింద ఇప్పటికే సుమారు 38,231 జిపియులు ఏర్పాటు చేయబడ్డాయి. ఈ జిపియులు భారతీయ స్టార్టప్‌లు, అకాడమియాకు తక్కువ ఖర్చుతో అందుబాటులో ఉంచబడుతున్నాయి. ఇది కొత్త రకాల ఉద్యోగాల సృష్టికి అలాగే దేశీయ పరిశోధనలను ప్రోత్సహించడానికి దోహదపడుతుంది. ఎఐ యుగంలో జిపియులు పారిశ్రామిక యంత్రాలతో సమానంగా మారుతున్నాయి. పెద్దఎత్తున కంప్యూటింగ్ మౌలిక సదుపాయాలకు లభ్యత కలిగిన దేశాలు ఎఐ మోడల్ డెవలప్‌మెంట్, డిఫెన్స్ టెక్నాలజీలు అలాగే ఎంటర్‌ప్రైజెస్, ఆటోమేషన్‌లో అసమాన ప్రయోజనాలను పొందగలవు. అదే సమయంలో, ప్రతి మౌలిక సదుపాయాల విస్తరణ వలే, ఎఐ డేటా సెంటర్లకు కూడా తీవ్రమైన సవాళ్లు ఉన్నాయి. ఎఐ డేటా సెంటర్లు చాలా ఎక్కువ విద్యుత్తును వినియోగించుకుంటాయి. 2030 నాటికి భారతదేశంలో డేటా సెంటర్ లోడ్ 1.2 జిడబ్ల్యు నుండి 4.5 జిడబ్ల్యుకు అవసరమవుతుందని, ఎఐ-డ్రివెన్ ఫెసిలిటీలు మాత్రమే సంవత్సరానికి అదనంగా 40 50 టెరావాట్ -గంటల (టిడబ్ల్యుహెచ్) విద్యుత్తును వినియోగించగలవని అంచనా. డేటా సెంటర్లు 2030 నాటికి భారతదేశం మొత్తం విద్యుత్ ఉత్పత్తిలో దాదాపు 5 శాతాన్ని వినియోగిస్తాయని నివేదికలు హెచ్చరిస్తున్నాయి. దాదాపు 13.5 జిడబ్ల్యు వరకు ఎలక్ట్రిసిటీ డిమాండ్ ను చేరుకోవచ్చు. ప్రస్తుత ఎలక్ట్రిసిటీ గ్రిడ్‌పై ఈ ఒత్తిడి, భారీ స్థాయి విద్యుత్ కోతలకు లేదా వోల్టేజ్ అస్థిరతకు కారణం కావచ్చు. డేటా సెంటర్లు అధిక ఉష్ణోగ్రతను నియంత్రించుకోవడానికి భారీ మొత్తంలో నీటిని ఉపయోగిస్తాయి. 2024లో భారతదేశపు డేటా సెంటర్లు సుమారు 150 బిలియన్ లీటర్ల నీటిని వినియోగించుకున్నాయి. అలాగే 2030 నాటికి ఈ సంఖ్య 358 బిలియన్ లీటర్లకు దాదాపు రెట్టింపు లేదా మూడు రెట్లు అవుతుంది. ఒక్క డేటా సెంటర్ రోజుకు సుమారు 20 లక్షల లీటర్ల నీటిని ఉపయోగించే అవకాశం ఉంది. ఇప్పటికే తీవ్ర నీటి కొరతను ఎదుర్కొంటున్న భారతదేశంలో, ఇది స్థానిక జలాశయాలను మరింత దెబ్బతీస్తుంది. పెద్ద నగరాల్లో డేటా సెంటర్లు కేంద్రీకృతమై ఉండటం వలన ఈ నీటి సంక్షోభం మరింత తీవ్రమవుతుంది. కార్బన్ ఉద్గారాలతోపాటు, ఇంకా పర్యావరణానికి ఇతర నష్టాలు కూడా ఉన్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద ఇ -వేస్ట్ ఉత్పత్తి చేసే దేశం. జిపియులు అలాగే ఎఐ హార్డ్‌వేర్ ర్యాపిడ్ రీప్లేస్‌మెంట్ ఎలక్ట్రానిక్ వేస్ట్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. అంతేకాకుండా, దక్షిణాసియాలో చాలా వరకు ఎఐ విస్తరణ దృశ్యాలు ఇప్పటికీ స్థిరత్వ పరిగణనలను పూర్తిగా విడిచిపెడుతున్నాయి. ప్రస్తుతం భారతదేశం ప్రపంచంలోని 20 శాతం డేటాను సృష్టిస్తుండగా, ప్రపంచంలోని డేటా సెంటర్లలో కేవలం 3 శాతం మాత్రమే ఇక్కడ ఉన్నాయి. ఇది పెద్ద వృద్ధి అవకాశాన్ని సూచిస్తుంది. కానీ భారీ మౌలిక సదుపాయాల పెట్టుబడులు అవసరమవుతాయి. వాణిజ్య దృక్కోణం నుండి, ఇది లాభదాయకంగా కూడా ఉంటుంది. పెద్ద- స్థాయి జిపియు మోహరింపులు 25.5 శాతం నుండి 28 శాతం వరకు అంతర్గత రాబడి రేటును సృష్టించగలవు. ఇది పెట్టుబడిని ఆకర్షిస్తుంది. వచ్చే ఐదేళ్లలో దేశంలో డేటా సెంటర్ కెపాసిటీ సుమారు 1.6 జిడబ్ల్యు నుండి 5 జిడబ్ల్యుకు చేరుకోబోతోంది. ఇది పెట్టుబడిదారులు అలాగే టెక్నాలజీ సంస్థలకు ఒక సువర్ణ అవకాశం కూడా. మరిన్ని కనుగొనండి బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ జాతీయ వార్తలు వార్తల వీడియోలు భారతదేశం తన డేటా సెంటర్ సామర్థ్యాన్ని విస్తరించడం ద్వారా తన కృత్రిమ మేధ లక్ష్యాలను సాధించాలనుకుంటోంది. ఇది అమలు చేయబడిన భారీ పెట్టుబడులు నిస్సందేహంగా ఆర్థిక వ్యవస్థను పునరుజ్జీవింపజేస్తాయి, సాంకేతిక రంగాన్ని ముందుకు నడిపిస్తాయి. అయితే, దీని కోసం అధిక విద్యుత్, భారీ మొత్తంలో నీటి వినియోగం వల్ల కలిగే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవడం చాలా అవసరం. భారతదేశం 2030 నాటికి 50 శాతం పునరుత్పాదక ఇంధన లక్ష్యాన్ని చేరుకున్నప్పటికీ, ఎఐ వృద్ధి ఆ ఇంధన పునాదులను పరీక్షించనుంది. అదే విధంగా, తీవ్ర నీటి కొరత ఉన్న దేశంలో, సాంప్రదాయ జల శీతలీకరణ ప్రత్యామ్నాయాలు ఇకపై సాధ్యం కాకపోవచ్చు. అలాగే, నివేదికల ప్రకారం, ప్రస్తుతం రాష్ట్ర స్థాయి డేటా సెంటర్ విధానాలలో సస్టైనబిలిటీ ప్రొవిజన్లు చాలా తక్కువగా ఉన్నాయి.

# స్వతంత్ర భారత దేశ చరిత్రలోనే అతిపెద్ద గృహ విప్లవం

**ఇందిరమ్మ ఇళ్లతో దేశానికి తెలంగాణ మార్గదర్శకం**

**13నెలల్లో లక్ష ఇళ్లు పూర్తి**

**మరో రెండు నెలల్లో మరో రెండు లక్షలు పూర్తి చేస్తాం**

**జూన్1న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రెండవ విడతకు శ్రీకారం కొత్తగూడలో సామూహిక గృహప్రవేశాలు**

**ఈ ఏడాది 3.50 లక్షల ఇళ్ల మంజూరు**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**




హైదరాబాద్, మే 31: ఏడు దశాబ్దాల స్వతంత్ర భారతదేశ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పేదల సొంతింటి కలలను నెరవేర్చడానికి ఉచితంగా ఐదు లక్షల రూపాయిలతో భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని అమలు చేస్తూ తెలంగాణ రాష్ట్రం దేశానికి మార్గదర్శకంగా నిలుస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, రెవెన్యూ, సమాచార ౚ పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు అవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ఇప్పుడు కేవలం గృహ నిర్మాణ కార్యక్రమం మాత్రమే కాకుండా పేద కుటుంబాల జీవితాలను మార్చేస్తున్న సామాజిక ఉద్యమంగా మారిందని అన్నారు. స్వతంత్ర భారత చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలు, సలహాలు సూచనల మేరకు భారీ గృహ నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టి తొలి విడతలో రాష్ట్రవ్యాప్తంగా నాలుగు లక్షలకు పైగా ఇండ్లను మంజూరు చేశామని ఆదివారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 1న ఆసిఫాబాద్ జిల్లా కరమెర మండలం కొరారి గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిచేతుల మీదుగా రెండవ విడతకు శ్రీకారం చుట్టబోతున్నామని ప్రకటించారు. అలాగే కొత్తగూడలో సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పాల్గొంటారు, రెండో విడతలో 2.5 లక్షల ఇళ్ల మంజూరుతో రెండు విడతల్లో కలిపి ఒక్కో నియోజకవర్గానికి 5500 నుంచి 6,500 ఇళ్లను మంజూరు చేసినట్లు అవుతుందన్నారు. ఐటిడిఎ ప్రాంతాల్లోని గిరిజన నియోజకవర్గాలకు అదనంగా 500 నుంచి 1500 వరకు మంజూరు చేశామని తెలిపారు. తాము ఆశించిన స్థాయిలో మొదటి విడతలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం విజయవంతమైందని గత ఏడాది ఫిబ్రవరి మూడవ వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నారాయణపేట జిల్లాలో ఇందిరమ్మ ఇళ్లకు శంకుస్థాపన చేశారని, ఈ 13 నెలల్లో లక్ష ఇళ్లను పూర్తి చేసుకొని మరో ఒకటి రెండు నెలల్లో మరో రెండు లక్షల ఇళ్లు పూర్తికాబోతున్నాయని తెలిపారు. ఇది ఏరకంగా చూసినా దేశానికే ఆదర్శవంతంగా ఒక రోల్ మోడల్‌గా నిలుస్తుందని అన్నారు.

ఈ ఏడాది 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను క్యూర్ పరిధిలో లక్ష ఇళ్లకు రాష్టం లోని ఇతర ప్రాంతాల్లో 2.50 లక్షలు మొత్తం 3.50 లక్షల ఇళ్ల మంజూరుకు పరిపాలనా అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు.

ఒక ప్రణాళికా బద్దంగా మొదటి విడతలో ఎదురైన మంచి చెడులను పరిగణనలో తీసుకొని మరింత పటిష్టంగా రెండోవిడత కార్యక్రమాన్ని అమలు చేయాలని ఇప్పటికే అధికారులను ఆదేశించడం జరిగిందన్నారు.

దేశంలోని చాలా రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వం ఇచ్చే పరిమిత నిధులతోనే గృహ నిర్మాణాలను కొనసాగిస్తున్నప్పటికీ, తెలంగాణ ప్రభుత్వం మాత్రం పేదవాడి ఇల్లు -- ప్రభుత్వ బాధ్యత అనే లక్ష్యంతో స్వంత నిధులతో ముందుకు సాగుతోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కేంద్రం కేవలం రూ.72 వేలే, పట్టణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు మాత్రమే ఇస్తున్నా, తెలంగాణ ప్రభుత్వం ఒక్కో లబ్ధిదారునికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోందని తెలిపారు.

స్వర్గీయ వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పటి 2013 వరకు అమలు చేసిన ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇండ్లు మంజూరై, ఇప్పటికీ అసంపూర్తిగా ఉన్న ఇండ్లను పూర్తి చేయడానికి, 2023 లో గృహ లక్ష్మి పథకంలో ఇండ్లు మంజూరై ఇప్పటికీ పూర్తి చేసుకోలేకపోయిన వారికి రెండవ విడతలో ఆ ఇంటి నిర్మాణం పూర్తి అవడానికి అవసరమయ్యే ఆర్థికసాయాన్ని అందిస్తామన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వంలో చేపట్టిన ఇందిరమ్మ పథకంలో 20వేల రూపాయిల వరకు ఆర్థికసాయం పొందినవారికి కూడా ఈ విడతలో ఇండ్ల మంజూరు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

# జనగణన హెచ్.ఎల్.ఓ లోపాల సవరణ, ఇందిరమ్మ ఇండ్ల మహా గృహప్రవేశాలను అత్యంత ప్రాధాన్యత తో పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు దిశానిర్దేశం



**ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**జనగణన హెచ్.ఎల్.ఓ డేటాలోని లోపాల సవరణతో పాటు, ఇందిరమ్మ ఇండ్ల మహా గృహప్రవేశాల కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత జిల్లా, మండల, మున్సిపల్ అధికారులకు ఆయన గూగుల్ మీట్ ద్వారా సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జనాభా గణనకు సంబంధించిన హెచ్.ఎల్.ఓ డేటాలో ఉన్న అన్ని రకాల అసంబద్ధతలను, లోపాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తక్షణమే సరిచేయాలని స్పష్టం చేశారు. ఈ ప్రక్రియలో మాస్టర్ ట్రైనర్లు, సూపర్వైజర్లు, చార్జ్ అధికారులు, వార్డు అధికారులు పూర్తి సమన్వయంతో వ్యవహరించి తప్పుల్లేని డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు.

అదేవిధంగా, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి, 'మహా గృహప్రవేశం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గృహనిర్మాణ శాఖకు చెందిన డీఈలు, ఏఈలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల ప్రగతిని పర్యవేక్షించాలని, అధికారులు తమకు కేటాయించిన విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించకుండా వంద శాతం లక్ష్యాలను సాధించాలని హెచ్చరించారు. ఈ వర్చువల్ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, జిల్లా పరిషత్ సీఈఓ రవి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, హౌసింగ్ పీడీ శంకర్, మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్, ఎంపీడీఓలు, చార్జ్ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సూపర్వైజర్లు, మాస్టర్ ట్రైనర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ఆలు లేదు చూలు లేదు.......ఇహెచ్ఎస్ కటింగ్ మొదలు. ఆర్థిక శాఖ అత్యుత్సాహం....తీవ్రంగా ఖండించిన టిఎస్ యుటిఎఫ్ సిఎం, డిప్యూటీ సిఎం జోక్యం చేసుకొని కోతలను రద్దు చేయాలి.

మహబూబ్ నగర్:ఉద్యోగుల ఆరోగ్య పథకం విధివిధానాలు ఖరారు కాలేదు. హాస్పిటల్స్ తో ఒప్పందం కుదిరింది లేదు. ప్యాకేజి రేట్లు నిర్ణయించలేదు. డిజిటల్ హెల్త్ కార్డులు ఇవ్వనేలేదు. ఈహెచ్ఎస్ చందా 1.5% మినహాయింపు పై జిఓ ఇవ్వలేదు. కానీ ఆర్థిక శాఖ అత్యుత్సాహంతో ఈహెచ్ఎస్ చందా పేరిట ఉద్యోగుల మే నెల వేతనాల్లో 1.5% కోత విధించటాన్ని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టిఎస్ యుటిఎఫ్) మహబూబ్ నగర్ జిల్లా అధ్యక్షులు కే రవికుమార్ ప్రధాన కార్యదర్శి ఎన్ వెంకటేష్ తీవ్రంగా ఖండించారు.

విధివిధానాల గురించి అడిగితే ఆరోగ్య శాఖ ఇస్తుందని సమాధానం చెప్పిన ఆర్థిక శాఖ అధికారులు, ఆ విధివిధానాలు లేకుండానే వేతనాల్లో కోత ఎలా పెడతారని ప్రశ్నించారు.

ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబ సభ్యుల వివరాలు ఐఎఫ్ఎంఐఎస్ సైట్ లో ఈరోజు వరకు నమోదు చేయాలని గడువు విధించి, నిన్నటిదాకా వెబ్ సైట్ లో మార్పులు చేస్తూనే ఉన్నారు. వివరాలు పూర్తిగా తీసుకోనే లేదు. పాత నిబంధనల ప్రకారం భార్యాభర్తలు ఉద్యోగులైతే ఒక్కరే చందా చెల్లించాలి. ఇప్పుడు ఇద్దరి నుంచి మినహాయించారు. ఆధారిత కుటుంబ సభ్యులపై స్పష్టత రానే లేదు.

నిజానికి ఉద్యోగుల, పెన్షనర్ల ఆరోగ్య సంరక్షణ బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. కానీ కార్పొరేట్ హాస్పిటల్స్ లో వైద్యం ఖరీదైన సమయంలో ఉద్యోగులు కూడా కొంత భరించాలని ప్రభుత్వం కోరినప్పుడు సంఘాలు అంగీకరించాయి. అయినా వేతనంలో 1.5% కోత నిర్ణయం పట్ల ఉద్యోగులు, పెన్షనర్లు తీవ్రమైన అసంతృప్తితో ఉన్నారు. వారిలో ఉన్న సందేహాలను తొలగించి ఆరోగ్య పథకాన్ని పారదర్శకంగా అమలు చేయాల్సిన సమయంలో....అందుకు తగిన చర్యలు తీసుకోకుండా ఇంత హడావుడిగా వేతనాల్లో కోత విధించడం ఉద్యోగుల్లో పలు అనుమానాలకు తావిస్తున్నది.

రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి మరియు ఆర్థిక మంత్రి వెంటనే జోక్యం చేసుకొని వేతనాల్లో కోతలు నిలివేయాలని డిమాండ్ చేశారు.

ఆర్థిక శాఖ తీసుకున్న ఏకపక్ష నియంతృత్వ నిర్ణయాల ఫలితంగా రాష్ట్ర ప్రభుత్వం అభాసుపాలవుతుందని వారు హెచ్చరించారు.


కృతజ్ఞతలతో.....

కే రవికుమార్, ఎన్ వెంకటేష్

అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి

టిఎస్ యుటిఎఫ్. మహబూబ్ నగర్ జిల్లా కమిటీ

# ఆపరేషన్ సిందూర్ 2.0'కు అంతా సిద్ధం: ఆర్మీ చీఫ్



న్యూ ఢిల్లీ త్రివిధ దళాలు ఆపరేషన్ సిందూర్ 2.0 కోసం సిద్ధంగా ఉన్నాయని ఆర్మీ చీఫ్ ద్వివేది వెల్లడించారు. నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఔఅం) పాసింగ్ ఔట్ పరేడ్లో యుద్ధ సన్నద్ధతపై మాట్లాడారు. మానవ రహిత రక్షణ వ్యవస్థలను బలోపేతం చేసినట్లు తెలిపారు. కాగా అశ్నీ డ్రోన్ ప్లటూన్స్, దివ్యాస్త్ర బ్యాటరీస్తో పనిచేసే ఆర్టిలరీ, శక్తిబాన్ రెజిమెంట్స్, శౌర్య స్క్వాడ్రన్స్ వంటి అన్‌ఆర్మ్ సిస్టమ్స్ రివ్యూకు సిద్ధంగా ఉన్నాయి.

## యువత స్ఫూర్తి పొందేలా ప్రధాని మోదీ గారి 'మన్ కీ బాత్'

## బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు



హైదరాబాద్ మే 31; యువత స్ఫూర్తి పొందేలా ప్రధాని మోదీ గారి 'మన్ కీ బాత్' ఉందని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు అన్నారు.

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నిర్వహించిన 134వ 'మన్ కీ బాత్' కార్యక్రమాన్ని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రాంచందర్ రావు హైదరాబాద్‌లోని హిమాయత్ నగర్, కె.ఎం.ఐ.టి లేన్ వద్ద పార్టీ నాయకులతో కలిసి ఉత్సాహంగా వీక్షించారు.



ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ, ప్రధాని నరేంద్ర మోదీ గారు ప్రతి 'మన్ కీ బాత్' ఎపిసోడ్ ద్వారా దేశానికి అవసరమైన అనేకస్ఫూర్తిదాయకమైన విషయాలను పంచుకుంటున్నారని రాంచందర్ రావు పేర్కొన్నారు. క్రీడల్లో మన క్రీడాకారులు కనబరుస్తున్న ప్రతిభ, వారు పడుతున్న కష్టం, వారి విజయగాథలు యువతకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇస్తున్నాయని ఆయన అభిప్రాయపడ్డారు.

ముఖ్యంగా అథ్లెటిక్స్‌లో మన వారు సాధిస్తున్న అద్భుతమైన రికార్డులు భారతదేశ సత్తాను ప్రపంచానికి చాటుతున్నాయని కొనియాడారు. అంతేకాకుండా, చారిత్రక అంశాలను ప్రస్తావిస్తూ రాజరాజ చోళుని సముద్రయాన ఘనతను, సాహసాలను ప్రధాని గుర్తు చేయడం అభినందనీయమని అన్నారు. వేసవి తీవ్రత దృష్ట్యా ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు తీసుకోవలసిన జాగ్రత్తలను, అలాగే మన సంప్రదాయ స్వదేశీ పానీయాలైన మామిడి పన్నా, సత్తు, సబ్జా గింజలతో తయారు చేసే రసాల ప్రాముఖ్యతను వివరించడం ద్వారా సామాన్య ప్రజలకు మేలు జరిగేలా ప్రధాని దిశానిర్దేశం చేశారని పేర్కొన్నారు.

మన్ కీ బాత్ లోని ప్రతి ఎపిసోడ్ కొత్త సమాచారాన్ని, కొత్త స్ఫూర్తిని ఇస్తుందని, అందుకే ఈ కార్యక్రమాన్ని దేశ యువత తప్పక చూడాలని రాంచందర్ రావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ అభయ పాటిల్ గారు, ఎమ్మెల్యే పాయల్ శంకర్ గారు, బిజెపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరేందర్ గౌడ్ , బిజెపి రాష్ట్ర కార్యదర్శి భరత్ ప్రసాద్, జి.మాధవి తదితరులు పాల్గొన్నారు.

## తీవ్ర ఎండలు.. వేసవి సెలవులు పొడిగించిన ఓయు



హైద్రాబాద్ మే 31 ; రాష్ట్రంలో తీవ్ర ఎండలు, వడగాలుల నేపథ్యంలో ఉస్మానియా యూనివర్సిటీ కీలక నిర్ణయం తీసుకుంది. వర్సిటీ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్ డిగ్రీ, పీజీ కాలేజీలకు వేసవి సెలవులను జూన్ 6 వరకు పొడిగించింది. ఇవాళితోనే సెలవులు ముగియాల్సి ఉండగా అకడమిక్ షెడ్యూల్లో మార్పులు చేసింది. జూన్ 8న (సోమవారం) తిరిగి కళాశాలలు పున:ప్రారంభం కానున్నట్లు ప్రకటించింది. విద్యార్థులు గమనించాలని కోరింది.


## మున్సిపల్ ఉద్యోగి రాటి పెల్లి నరసింహారావు

## ఉద్యోగ పదవి విరమణ




వరంగల్ మే 31 ;వరంగల్ తూర్పు నియోజకవర్గం లో భాగంగా కొత్త వాడకు చెందిన మున్సిపల్ ఉద్యోగి రాటి పెల్లి నరసింహారావు ఉద్యోగ పదవి విరమణ కార్యక్రమ విన్నర్ విల్ క్లబ్లో జరిగింది ఈ పదవి విరమణ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా విచ్చేసిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి శాలువాతో సత్కరించి అనంతరం రాజనాల మాట్లాడుతూ మున్సిపల్ నీటి సరఫరా ఉద్యోగ గత 42 సంవత్సరాలు సేవలందించి తనదైన శైలిలో మున్సిపాలిటీకి ఎలిమెంట్ సేవలు చేసినారు ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ చైర్మన్ టి రమేష్ బాబు రామలింగేశ్వర స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ పాలారపు కృష్ణమూర్తి వరంగల్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి పోలేపాక ప్రసాద్ మట్టవాడ కుమార్ ఏఈలు డిఈలు సహచర మున్సిపల్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు....

## రామప్ప దేవాలయానికి పోటెత్తిన భక్తులు



**ములుగు జిల్లా ప్రజాబలం ప్రతినిధి మే 31** రామప్పప్రపంచ ప్రఖ్యాతిగాంచిన యునెస్కో గుర్తింపు పొందిన. రామప్ప దేవాలయంలో సండే కావడంతో కుటుంబ సమేతంగా చిన్న పెద్ద తారతమ్యం లేకుండా ఈరోజు ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని రామప్ప దేవాలయాన్ని సందర్శించారు సందడి భక్తులకు ఆలయ అర్చకులు హరీష్ శర్మ ఉమాశంకర్ లు పూజలు చేసి తీర్థ ప్రసాదాలు అందచేసారు తర్వాత ఆలయ చరిత్ర శిల్పకలా వైభవాన్ని టూరిజం గైడ్ తాడబోయిన వెంకటేష్ ద్వార తెలుసుకున్నారు

## మంగపేట మండలంలోని ప్రాజెక్టులను మరమ్మత్తు చేయించిన మంత్రి సీతక్క



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజాబలం ప్రతినిధి మంగపేట** ఆదివారం మల్లూరు వాగు నర్సింహాసాగర్ ప్రాజెక్ట్ తూము మరమ్మత్తులు చేపించి వేలాది ఎకరాలకు నీరు అందించేలా చర్యలు తీసుకున్న మంత్రి గారికి నర్సింహాసాగర్ గ్రామ రైతులు ధన్యవాదాలుతో హర్షం వ్యక్తం చేశారు..

నర్సింహసాగర్ రైతులు మట్లాడుతూ గత వర్షాకాలం లో మండలములోని నర్సింహాసాగర్ లోని సాగునీటి ప్రాజెక్ట్ కి తూము లిఫ్ట్ పాడైపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నామని స్థానిక కాంగ్రెస్ నాయకుల ద్వారా తెలుపగా వెంటనే స్పందించిన గౌరవ మంత్రి సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇవ్వగా రెండు రోజులు కష్టపడి మూడు లక్షల రూపయలను కర్చు చేసి తూము లిఫ్ట్ బాగు చేసి రభీ,ఖరీఫ్ పంటకు నీరు అందించారు తూమ్ శట్టర్ శాస్వత పరిస్కారం కావాలని గత వారం కింద గౌరవ మంత్రి గారిని అడగ్గా వెంటనే స్పందిచిన మంత్రి తూము శాస్వత పరిశ్కారమ్ చేసి దాదాపు 7వేల ఎకరాలకు సాగు నీరుని అందించి మా కష్టాన్ని కడతీర్చిందని గ్రామ రైతులు సంతోషాన్ని వ్యక్తపరచారు గత ప్రభుత్వం లో ఆనాటి స్థానిక మంత్రులు సాక్షాత్తు నీటి పారుదల మంత్రి హరిష్ రావు లాంటి రాజకీయ నాయకులు వచ్చి ఎన్నో మాటలు చెప్పిన ఒక్క పని కూడా చేయలేదని ఎద్దేవ చేశారు

గౌరవ సీతక్క అడిగిన వెంటనే మా రైతులపై ప్రత్యేక శ్రద్ద చూపించి వేల ఎకరాలకు నీరు అందించి మాకు మేలు చేసిందని ఆనందం వ్యక్త పరచారు..కార్యక్రమములో గ్రామ రైతులు,గ్రామ పార్టి అధ్యక్షులు తాటినేని హరికృష్ణ,జిల్లా ఎస్సి ఎస్టీ అట్రాసిటీ విజలెన్స్ మెంబర్ మురుకుట్ల నరేందర్,డొప్పలపుడి సీతారామయ్య,ఉప్పలపాటి ప్రభాకర్,కోడం శ్రీకాంత్,నైనారపు రాజు,బందు రాము,ఈర్ల మహీందర్,కాటబోయిన శ్రీకాంత్,ఆచంట దేవేందర్, గడ్డి సునీల్,ఉబ్బాని సతీష్,జిగట సాయి ,తదితరులు పాల్గొన్నారు

## మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆందోల్ నియోజకవర్గపర్యటన



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 31 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** మంత్రి దామోదర్ రాజనర్సింహ, ఈరోజు ఆదివారం, మునిపల్లి, రాయికోడ్ మండలాలలో సుడిగాలి పర్యటన చేశారు, బుధేర లోని సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల మహిళా డిగ్రీ కళాశాల లలో అకడమిక్ బ్లాక్,బిల్డింగ్ నిర్మాణం పై స్థల పరిశీలన,లింగంపల్లి, లోని రెసిడెన్షియల్ స్కూల్, జూనియర్ కాలేజ్ లో నూతనంగా నిర్మించే ప్రతిపాదిత స్కూలు భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలన,కంకోల్, రోడ్డు టోల్ గేట్ దగ్గర తెలంగాణ టూరిజం ఆధ్వర్యంలో ప్రతిపాదిత టూరిజం హోటల్,కన్వెన్షన్ సెంటర్ నిర్మాణ స్థల పరిశీలనఅనంతరం మునిపల్లి, మండలం గార్లపల్లి, తక్కలపల్లి, గ్రామాల మధ్య నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి పనులను మంత్రిపరిశీలించారు,పర్యటనలో భాగంగా సింగూరు, ప్రాజెక్టు డ్యాం బ్యాక్ వాటర్ గ్రామాలను అనుసంధానం చేసే, రోడ్డు, బ్రిడ్జి,నిర్మాణ పనులను పరిశీలించారు ఈ పర్యటనలో మక్తక్యాసారంనుండిరాయికోడు, మండలం లోనిహస్నాబాద్, మొగుడంపల్లి, కర్చల్ , సింగితం,గ్రామాల మీదుగా నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులను మంత్రి పరిశీలించారు.





## కొత్త ఆసరా పెన్షన్ల కోసం, ఎంపీడీవో ఆఫీస్ లో గానీ,గ్రామపంచాయతీ లో గానీ దరఖాస్తు చేసుకోవాలి

## చిటమట రఘు మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు



**ఏటూరు నాగారం డివిజన్ ప్రజా బలం ప్రతినిధి మే 31** బితెలంగాణ రాష్ట్ర ప్రజా ప్రభుత్వం కొత్తగా రెండు లక్షల ఆసరా పెన్షన్లను ప్రారంభించనున్నారు. జూన్ 2 తారీఖున తెలంగాణా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి మరియు మంత్రి సీతక్క మంత్రివర్గం కలిసి ప్రారంభించనున్నారు. ఏటూరు నాగారం ప్రజలందరూ గతంలో ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకోని వారు తమకు సంబంధించిన గ్రామ పంచాయతీలో ఆసరా పెన్షన్ల గురించి పంచాయతీ కార్యదర్శి దగ్గర దరఖాస్తు చేసుకోవాలని ఏటూరు నాగారం మండల మాజీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు అన్నారు.బిఆసరా పెన్షన్ లో వృద్యాప్య!పింఛను,వితంతు మహిళా,వికలాంగులు (దివ్యంగులు ) ఒంటరి మహిళలు, దీర్ఘాలిక వ్యాధులు గల లబ్ధిదారులు అందరు ఈ అవకాశాన్ని వినియోగించు కోగలరని కోరారు కాంగ్రెస్ పార్టీ సర్పంచులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు నాయకులు ఈ విషయాన్ని సద్వినియోగం చేసుకొని పెన్షన్ల విషయంలో ప్రజలకు సహకరించాలని కోరారు.






ఆదివారం శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకున్న దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు

# థైరాయిడ్ సమస్యలా? మీ డైట్‌లో ఈ ఫుడ్స్ తప్పనిసరి!

**శరీర జీవక్రియల్లో థైరాయిడ్ గ్రంథి పాత్ర కీలకం**
**థైరాయిడ్ ఆరోగ్యానికి కొన్ని పోషకాలు అత్యంత అవసరం**
**పాలు, గుడ్లు, చేపలు హార్మోన్ల ఉత్పత్తికి సహాయపడతాయి**
**ఆకుకూరలు, నట్స్, గింజలు జీవక్రియలను మెరుగుపరుస్తాయి**
**ఆహారంతో పాటు వైద్య సలహా తప్పనిసరి అని నిపుణుల సూచన**

మన శరీరంలోని జీవక్రియలను నియంత్రించడంలో థైరాయిడ్ గ్రంథిది కీలకపాత్ర. ఇది ఉత్పత్తి చేసే టీ3, టీ4 హార్మోన్లు గుండె స్పందన, శరీర ఉష్ణోగ్రత, శక్తి వినియోగం వంటి ముఖ్యమైన పనులను సమన్వయం చేస్తాయి. ఈ హార్మోన్ల ఉత్పత్తి సక్రమంగా జరగాలంటే కొన్ని పోషకాలు తప్పనిసరి. సరైన ఆహారం ద్వారా థైరాయిడ్ పనితీరును మెరుగుపరుచుకోవచ్చు.



థైరాయిడ్ ఆరోగ్యాన్ని కాపాడటంలో సహాయపడే కొన్ని ముఖ్యమైన ఆహారాలు ఇక్కడ ఉన్నాయి. వీటిని మీ రోజువారీ డైట్‌లో చేర్చుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి.

పాలు, పెరుగు: వీటిలో ఉండే అయోడిన్, ప్రొటీన్లు థైరాయిడ్ హార్మోన్ల ఉత్పత్తికి చాలా అవసరం.

గుడ్లు: అయోడిన్, సెలీనియం, విటమిన్ డి సమృద్ధిగా లభించి థైరాయిడ్ పనితీరుకు మద్దతు ఇస్తాయి.

చేపలు: ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు, అయోడిన్, సెలీనియం కలిగి ఉండి శరీరంలోని వాపును తగ్గించి థైరాయిడ్ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి.

ఆకుకూరలు: ఐరన్, ఫోలేట్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండి జీవక్రియలు మెరుగ్గా పనిచేసేలా చూస్తాయి.

పప్పుధాన్యాలు: ప్రొటీన్, జింక్, ఐరన్ అందించి హార్మోన్ల ఉత్పత్తికి సహాయపడతాయి.

నట్స్, గింజలు: బాదం, నువ్వులు, వేరుశెనగ, గుమ్మడి గింజల వంటివి ఆరోగ్యకరమైన కొవ్వులు, సెలీనియం, జింక్‌ను అందిస్తాయి.

పుట్టగొడుగులు, కొబ్బరి: ఇవి విటమిన్ డి, శక్తినిచ్చే ఎంసీటీల వంటి పోషకాలను అందించి రోగనిరోధక శక్తిని పెంచుతాయి.

గమనిక: థైరాయిడ్ సమస్యలను కేవలం ఆహార మార్పులతోనే పూర్తిగా నయం చేయలేమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. ఇది కేవలం సహాయకారి మాత్రమే. వైద్యులు సూచించిన మందులు వాడటం, క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని

# నిద్రలో కాళ్ల పిక్కలు పట్టేస్తున్నాయా? అయితే ఇది మీకోసమే!

**రాత్రిపూట పిక్కలు పట్టేయడం 40 ఏళ్లు దాటిన వారిలో సర్వసాధారణం**
**కండరాల అలసట, డీహైడ్రేషన్, పోషకాల లోపం ప్రధాన కారణాలు**
**రోజూ స్ట్రెచింగ్, సరిపడా నీరు తాగడం ద్వారా నొప్పిని నివారించవచ్చు**
**నొప్పి తరచుగా వస్తుంటే వైద్యులను సంప్రదించడం అవసరం**

చాలా మందికి రాత్రిపూట గాఢ నిద్రలో ఉన్నప్పుడు అకస్మాత్తుగా కాలి పిక్కలు పట్టేసి తీవ్రమైన నొప్పితో మెలకువ వస్తుంది. ఇది సర్వసాధారణమైన సమస్యే, ముఖ్యంగా 40 ఏళు దాటిన వారిలో ఎక్కువగా కనిపిస్తుంది. సాధారణంగా ఇది ప్రమాదకరం కానప్పటికీ, నిద్రకు ఆటంకం కలిగించి, మరుసటి రోజు కూడా నొప్పిని మిగులుస్తుంది.

ప్రధాన కారణాలు ఏంటి?



రోజంతా నిలబడటం, నడవడం వల్ల కండరాలు అలసిపోవడం దీనికి ఒక ముఖ్య కారణం. సరైన విశ్రాంతి, స్ట్రెచింగ్ లేనప్పుడు రాత్రివేళ కండరాలు పట్టేస్తాయి. అలాగే, శరీరంలో నీటి శాతం (డీహైడ్రేషన్) తగ్గడం, మెగ్నీషియం, పొటాషియం, కాల్షియం వంటి ఖనిజాల సమతుల్యత లోపించడం కూడా కండరాల పనితీరుపై ప్రభావం చూపుతుంది. శరీరంలో నీటి కొరత ఖనిజాల సమతుల్యతను దెబ్బతీస్తుందని నిపుణులు వివరిస్తున్నారు. వీటితో పాటు, పడుకునే భంగిమ సరిగా లేకపోవడం, నరాల సమస్యలు, రక్త ప్రసరణ తగ్గడం, కొన్ని రకాల మందులు కూడా ఈ సమస్యకు దారితీయవచ్చు.

నివారణ, ఉపశమన మార్గాలు

నొప్పి వచ్చిన వెంటనే పిక్క కండరాన్ని నెమ్మదిగా సాగదీయాలి. పాదాన్ని పైకి లేపి మడిమను ముందుకు నెట్టడం ద్వారా తక్షణ ఉపశమనం పొందవచ్చు. ఆ ప్రదేశంలో మసాజ్ చేయడం, వేడి నీటి కాపడం పెట్టడం కూడా మేలు చేస్తుంది.

ఈ సమస్యను నివారించడానికి రోజూ పడుకునే ముందు పిక్కలు, తొడ కండరాలను స్ట్రెచ్ చేయడం అలవాటు చేసుకోవాలి. రోజంతా సరిపడా నీరు తాగాలి. అరటిపండ్లు, ఆకుకూరలు, నట్స్ వంటి పొటాషియం, మెగ్నీషియం అధికంగా ఉండే ఆహారాన్ని తీసుకోవాలి. ఎక్కువ సేపు ఒకేచోట కూర్చోవడం లేదా నిలబడటం వంటివి తగ్గించుకోవాలి. ఈ జాగ్రత్తలు తీసుకున్నా సమస్య తరచుగా వస్తుంటే లేదా నొప్పితో పాటు వాపు, ఎరుపుదనం వంటి లక్షణాలు కనిపిస్తే వైద్యులను సంప్రదించడం ఉత్తమం.

# 6-6-6 వాకింగ్ టెక్నిక్: బరువు తగ్గడంతో పాటు గుండె ఆరోగ్యానికి సూపర్ ఫార్ములా!

**6 నిమిషాల వార్మప్‌తో కండరాల సంసిద్ధత**
**60 నిమిషాలు వేగంగా నడిచే కార్డియో వ్యాయామం**
**6 నిమిషాల కూల్‌డౌన్‌తో సాధారణ స్థితికి హార్ట్ రేట్**
**ఉదయం 6 గంటలు లేదా సాయంత్రం 6 గంటల వేళ అనుకూల సమయం**
**సులభంగా బరువు తగ్గేందుకు ఉత్తమ మార్గం**

ఆరోగ్యంగా ఉండటానికి నడకను మించిన వ్యాయామం లేదు. అయితే సాధారణంగా నడిచే నడకను మరింత ప్రభావవంతంగా మార్చేందుకు సరికొత్త ఫిట్‌నెస్ విధానాలు ఇప్పుడు ట్రెండ్ అవుతున్నాయి. అందులో ఒకటే ఈ '6-6-6 వాకింగ్ టెక్నిక్'. రోజువారీ నడకను పద్ధతి ప్రకారం చేస్తూ, గుండె వేగాన్ని పెంచి, ఎక్కువ క్యాలరీలు కరిగించేందుకు ఈ టెక్నిక్ ఎంతగానో ఉపయోగపడుతుంది.



6-6-6 వాకింగ్ అంటే ఏంటి?

మొదట 6 నిమిషాల పాటు చాలా నెమ్మదిగా, సాధారణ వేగంతో నడవాలి. ఇది మీ కండరాలను నడకకు సిద్ధం చేస్తుంది.

వార్మప్ పూర్తయ్యాక గంట సేపు లేదా 6,000 అడుగులు పడేలా వేగంగా నడవాలి. ఇది మీ గుండె వేగాన్ని పెంచి క్యాలరీలను కరిగిస్తుంది.

చివరగా మరో 6 నిమిషాల పాటు నడక వేగాన్ని పూర్తిగా తగ్గించి రిలాక్స్‌గా నడవాలి. ఇది పెరిగిన గుండె వేగాన్ని మళ్లీ సాధారణ స్థితికి తెస్తుంది.

ఏ సమయంలో నడిస్తే మంచిది?

ఈ 6-6-6 వాకింగ్ టెక్నిక్ పూర్తి ప్రయోజనాలు దక్కాలంటే సమయం కూడా ముఖ్యమే. దీనికోసం ఉదయం 6 గంటలు లేదా సాయంత్రం 6 గంటల సమయాన్ని ఎంచుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. సూర్యోదయం, సూర్యాస్తమయ సమయాల్లో నడవడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది.

ఈ టెక్నిక్ వల్ల కలిగే లాభాలు

గంట సేపు వేగంగా నడవడం వల్ల శరీరంలో మెటబాలిజం పెరిగి, కీళ్లపై ఒత్తిడి పడకుండానే సులభంగా బరువు తగ్గుతారు.

నడక వేగంలో మార్పులు ఉండటం వల్ల గుండె సామర్థ్యం మెరుగవుతుంది. రక్తప్రసరణ బాగా సాగుతుంది.

ఉదయం లేదా సాయంత్రం వేళల్లో నడవడం వల్ల ఒత్తిడిని కలిగించే కార్టిసాల్ హార్మోన్ స్థాయిలు తగ్గి, అలసట దూరమవుతుంది.

నడకకు ముందు వార్మప్, తర్వాత కూల్‌డౌన్ చేయడం వల్ల కండరాలు పట్టేయడం, నొప్పులు రావడం వంటి సమస్యలు ఉండవు.

జాగ్రత్తలు

అలవాటు లేని వారు మొదటి రోజే గంట సేపు వేగంగా నడిస్తే త్వరగా అలసిపోతారు. కాబట్టి మీ శరీర సహకారాన్ని బట్టి నడక వేగాన్ని నెమ్మదిగా పెంచాలి. వాకింగ్‌కు వెళ్లేటప్పుడు మంచి స్పోర్ట్స్ షూ వేసుకోవడం, సమయాన్ని చూసుకోవడానికి వీలుగా టైమర్ పెట్టుకోవడం మంచిది. నడకకు ముందు, తర్వాత తగినన్ని నీళ్లు తాగడం మర్చిపోవద్దు.

# మీకు కాఫీ, టీ తాగే అలవాటు ఉందా? కెఫీన్ అడిక్షన్‌కు గురయ్యారేమో ఈ 3 సంకేతాలతో తెలుసుకోండి!

**కాఫీ, టీ అతిగా తాగడం వల్ల కెఫీన్ అడిక్షన్ ముప్పు**
**సమయానికి కెఫీన్ అందకపోతే తలనొప్పి, నీరసం**
**నిద్రలేమి, గుండె వేగంగా కొట్టుకోవడం ప్రధాన లక్షణాలు**
**ఒక్కసారిగా కాకుండా క్రమంగా కాఫీలు తగ్గించడం ఉత్తమం**
**గర్భిణులు, గుండె జబ్బులు ఉన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి**

ఉదయం లేవగానే కాఫీ లేదా టీ తాగనిదే చాలామందికి రోజు గడవదు. అలసటను తగ్గించుకోవడానికి, ఎనర్జీ కోసం తీసుకునే ఈ పానీయాలు నెమ్మదిగా మనల్ని వాటికి బానిసలుగా (కెఫీన్ డిపెండెన్స్) మార్చేస్తున్నాయని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమాజంలో ఇది చాలా సాధారణ అలవాటుగా మారిపోవడం వల్ల, చాలామంది తాము 'కెఫీన్ యూజ్ డిజార్డర్' అనే మానసిక, శారీరక రుగ్మతకు లోనైనట్లు గుర్తించలేకపోతున్నారు.

ప్రధాన సంకేతాలు

తీవ్రమైన తలనొప్పి

రోజూ తాగే సమయానికి కాఫీ లేదా టీ తాగకపోతే తలనొప్పి, నీరసం, చిరాకు, మెదడు మొద్దుబారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. మన శరీరం, నరాల వ్యవస్థ ఆ కెఫీన్‌కు అలవాటు పడిపోవడం వల్లే ఇలా జరుగుతుంది. ఇది ఒక రకమైన విత్‌డ్రాయల్ సింప్టమ్ అని వైద్యులు చెబుతున్నారు.

తీవ్రమైన ఆందోళన

మధ్యాహ్నం లేదా సాయంత్రం వేళల్లో కెఫీన్ ఎక్కువగా తీసుకోవడం వల్ల రాత్రిపూట గాఢ నిద్ర కరవవుతుంది. నిద్ర సరిగా లేకపోతే మరుసటి రోజు అలసటగా అనిపించి మళ్లీ ఎక్కువ కాఫీలు తాగే ప్రమాదకరమైన చక్రంలో ఇరుక్కుపోతారు. దీనివల్ల నరాల వ్యవస్థ అతిగా ఉత్తేజితమై గుండె వేగంగా కొట్టుకోవడం, చేతులు వణకడం, అనవసరమైన ఆందోళన పెరగడం వంటి సమస్యలు తలెత్తుతాయి.

కడుపులో మంట

కెఫీన్ కడుపులో యాసిడ్ ఉత్పత్తిని వేగవంతం చేస్తుంది. దీనివల్ల విపరీతమైన ఎసిడిటీ, కడుపులో అసౌకర్యం, వికారం, మోషన్స్ వంటి జీర్ణక్రియ సమస్యలు తలెత్తుతాయి.

ముఖ్యంగా ఎనర్జీ డ్రింక్స్, ప్రీ-వర్కౌట్ సప్లిమెంట్లలో ఉండే కెఫీన్, షుగర్ కంటెంట్ వల్ల ఈ ముప్పు మరింత ఎక్కువవుతుంది.

బ్రెయిన్‌ను ఎలా బురిడీ కొట్టిస్తుంది?

మన మెదడులో అలసటను, నిద్రను కలిగించే 'అడెనోసిన్' అనే రసాయనాన్ని కెఫీన్ తాత్కాలికంగా అడ్డుకుంటుంది. దీనివల్ల మెదడుకు అలసట తెలియక తాత్కాలికంగా



అలర్ట్‌నెస్, ఎనర్జీ పెరిగినట్లు అనిపిస్తుంది. కానీ దీర్ఘకాలంలో బాడీ దీనికి అలవాటు పడిపోవడం వల్ల పాత కిక్ రావడానికి రోజురోజుకూ ఎక్కువ కప్పుల కాఫీలు తాగాల్సి వస్తుంది.

బయటపడండిలా..

ఒక్కసారిగా మానేయకుండా రోజువారీ కప్పుల సంఖ్యను క్రమంగా తగ్గించాలి.

సాయంత్రం లేదా రాత్రి వేళల్లో కెఫీన్ ఉత్పత్తులను పూర్తిగా దూరం పెట్టాలి.

కాఫీకి బదులుగా గ్రీన్ టీ, హెర్బల్ టీ లేదా ఎక్కువ నీళ్లు తాగడం అలవాటు చేసుకోవాలి.

# త్వరగా బరువు తగ్గుతున్నారా? అయితే మీరు ప్రమాదంలో పడ్డట్లే!

తక్కువ రోజుల్లోనే ఎక్కువ బరువు తగ్గాలని చాలా మంది కఠినమైన డైట్‌లు చేస్తుంటారు. ముఖ్యంగా నగరాల్లో ఊబకాయం సమస్య పెరుగుతుండటంతో బరువు తగ్గాలనే ఆరాటం ఎక్కువైంది. ఇలా ఒక్కసారిగా కిలోల కొద్దీ బరువు తగ్గడం వల్ల శరీరానికి ఎంత నష్టం జరుగుతుందో చాలా మందికి తెలియదు. వైద్య నిపుణుల ప్రకారం.. వేగంగా బరువు తగ్గితే శరీరంలో కొవ్వు కంటే కీలకమైన కండరాలే కరిగిపోతాయి. ఇది శరీర జీవక్రియ (మెటబాలిజం) రేటును శాశ్వతంగా దెబ్బతీస్తుంది.

కండరాలను ఎందుకు కరిగిస్తుంది?

మనం తీసుకునే ఆహారాన్ని ఒక్కసారిగా తగ్గించినప్పుడు మన శరీరం దాన్ని ఒక ప్రమాదకరమైన కరవు పరిస్థితిగా భావిస్తుంది. ప్రాణాలు కాపాడుకోవాలనే రక్షణ చర్యలో భాగంగా తనలో ఉన్న కొవ్వును దాచిపెట్టి జీవక్రియకు అవసరమైన శక్తి కోసం కండరాలనుకరిగించడంమొదలు పెడుతుంది. కండరాలు నిరంతరం క్యాలరీలను ఖర్చు చేసే ఇంజన్ లాంటివి. నిద్రపోతున్నా, విశ్రాంతి తీసుకుంటున్నా అవి శక్తిని వాడుకుంటూనే ఉంటాయి. ఇలా కండరాలు తగ్గిపోతే మన శరీరం రోజువారీగా క్యాలరీలను ఖర్చు చేసే సామర్థ్యం కూడా పడిపోతుంది.

మళ్లీ పాత పద్ధతికి వస్తే

కఠినమైన డైటింగ్ ఆపేసి తిరిగి సాధారణ ఆహారం తీసుకోవడం ప్రారంభించగానే అసలు సమస్య మొదలవుతుంది. కండరాలు తగ్గిపోవడం వల్ల శరీరంలో క్యాలరీలు కరిగే సామర్థ్యం (మెటబాలిజం) అప్పటికే తగ్గిపోతుంది. దీనివల్ల మనం తినే సాధారణ ఆహారంలోని క్యాలరీలు కూడా కరగవు. ఫలితంగా మునుపటి కంటే చాలా వేగంగా శరీరంలో కొవ్వు పేరుకుపోయి మళ్లీ బరువు పెరుగుతారు. దీనికంటే క్రమంగా బరువు తగ్గడమే సురక్షితమని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

సురక్షితంగా బరువు తగ్గడం ఎలా?

లి నిత్యం తీసుకునే ఆహారంలో ఒకేసారి కాకుండా కేవలం 300 నుంచి 500 క్యాలరీలు మాత్రమే తగ్గించాలి. దీనివల్ల శరీరం ప్రమాదాన్ని గుర్తించదు.

లి ప్రతి భోజనంలోనూ తగినంత ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలి.

# ఏసీలు, కరెంట్ లేని కాలంలో చల్లదనం కోసం... రాజుల అద్భుతమైన టెక్నిక్స్!

**ఏసీలు లేని కాలంలో రాజులు వాడిన కూలింగ్ టెక్నిక్స్ పై పెరుగుతున్న ఆసక్తి**

**నీటి వనరుల దగ్గర కోటల నిర్మాణం, ఫౌంటెయిన్లు, కాలువలతో చల్లదనం**

**మందపాటి గోడలు, ఎత్తైన పైకప్పులు, జాలీ కిటికీలతో ప్రత్యేక నిర్మాణాలు**

**పెరుగుతున్న ఉష్ణోగ్రతల నేపథ్యంలో ఈ పద్ధతులు ఇప్పుడు ఆదర్శంగా నిలుస్తున్నాయి**

దేశవ్యాప్తంగా తీవ్రమైన ఎండలతో ప్రజలు అల్లాడుతుండగా, ఏసీలపై భారం పెరిగిపోతోంది. ఇలాంటి సమయంలో, కరెంటు, ఏసీలు వంటి ఆధునిక సౌకర్యాలు లేని శతాబ్దాల క్రితం మన రాజులు, మహారాజులు తమ రాజభవనాల్లో వేసవి తాపాన్ని ఎలా తట్టుకున్నారనే విషయంపై ఆసక్తికర చర్చ జరుగుతోంది. వారి వాస్తు నైపుణ్యం, ప్రకృతిని వాడుకున్న తీరు నేటి ఇంజినీర్లకు సైతం స్ఫూర్తినిస్తోంది.

భారత్‌లో 1930ల తర్వాతే ఏసీల వాడకం మొదలైంది. కానీ అంతకు ఎన్నో శతాబ్దాల ముందే మన రాజులు తమ నివాసాలను చల్లగా ఉంచుకోవడానికి అద్భుతమైన పద్ధతులు పాటించారు. కోటల నిర్మాణానికి నదులు, సరస్సులు, కొండల సమీపంలోని ప్రదేశాలను ఎంచుకునేవారు. రాజభవన ప్రాంగణాల్లో ఫౌంటెయిన్లు, నీటి కాలువలు ఏర్పాటు చేసేవారు. వీటి నుంచి వచ్చే నీటి ఆవిరి, చల్లని గాలిని అందించి పరిసరాలను చల్లబరిచేది. కొన్ని కోటల్లో గోడల లోపల మట్టి పైపుల ద్వారా నీటిని నిరంతరం ప్రవహింపజేసి, రాతి కట్టడాల వేడిని తగ్గించేవారు. హంపిలోని లోటస్ మహల్, ఆగ్రా కోటలో ఇలాంటి నిర్మాణాలు కనిపిస్తాయి.



భవన నిర్మాణంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకునేవారు. మట్టి, సున్నపురాయి, ఇటుకలతో కట్టిన మందపాటి గోడలు పగటిపూట వేడిని నెమ్మదిగా గ్రహించి, రాత్రిపూట నెమ్మదిగా విడుదల చేసేవి. ఎత్తైన పైకప్పుల వల్ల వేడి గాలి పైకి వెళ్లిపోయేది. గాలి ప్రసరణకు వీలుగా విశాలమైన ప్రాంగణాలు, వరండాలు నిర్మించేవారు. సూర్యరశ్మి నేరుగా పడకుండా ప్రత్యేక నిర్మాణాలు, గాలిని అనుమతిస్తూ వెలుతురును వడపోసేందుకు 'జాలీ' కిటికీలు ఏర్పాటు చేసేవారు. జైపూర్‌లోని హవా మహల్ ఇందుకు చక్కటి ఉదాహరణ. కొన్నిచోట్ల పైకప్పులపై 'బాద్‌గిర్' అనే ప్రత్యేక నిర్మాణాలు ఏర్పాటు చేసి, బయటి చల్లగాలిని పట్టుకొని లోపలికి పంపేవారు.

నేడు విద్యుత్ వినియోగం, వాతావరణ మార్పులు పెను సవాళ్లుగా మారిన తరుణంలో, విద్యుత్ అవసరం లేని ఈ "పాసివ్ కూలింగ్" పద్ధతులు మళ్లీ ప్రాధాన్యం సంతరించుకున్నాయి. మన ఘనమైన వాస్తు వారసత్వాన్ని పునఃపరిశీలించడం ద్వారా నేటి సమస్యలకు సైతం పరిష్కారాలు కనుగొనవచ్చని ఈ నిర్మాణాలు గుర్తుచేస్తున్నాయి.

# దగ్గుమందు నాకిన బల్లి.. వీడియో వైరల్.. ప్రమాదం అంటున్న నిపుణులు!

**సిరప్ బాటిల్‌ను బల్లి నాకిన వీడియో సోషల్ మీడియాలో వైరల్**

**వాడిన తర్వాత మందుల బాటిళ్లను శుభ్రంగా మూసివేయాలని డాక్టర్ల హెచ్చరిక**

**తీపి సిరప్‌లకు కీటకాలు, బల్లులు ఆకర్షితమై కలుషితం చేసే ప్రమాదం**

**ముఖ్యంగా పిల్లల్లో ఇన్ఫెక్షన్లు సోకే అవకాశం ఉందని వైద్యుల ఆందోళన**

**మందులను సురక్షిత ప్రదేశంలో భద్రపరచాలని నిపుణుల సూచన**




వాడిన తర్వాత మందుల బాటిళ్లను సరిగ్గా మూసివేయకపోతే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తప్పవని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఓ సిరప్ బాటిల్‌పై ఉన్న మందుకు అంటుకున్న బల్లి దానిని నాకుతున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయంపై మళ్లీ చర్చ మొదలైంది. ముఖ్యంగా పిల్లలకు మందులు ఇచ్చేటప్పుడు ఇలాంటి నిర్లక్ష్యం ప్రమాదకరమని నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

సోషల్ మీడియాలో ఈ వీడియో విస్తృతంగా షేర్ అయింది. ఇందులో ఓ బల్లి దగ్గు మందు సిరప్ బాటిల్‌పై ఎక్కి, మూత చుట్టూ అంటుకున్న తీపి ద్రవాన్ని నాకడం కనిపిస్తుంది. ఇలా వాడి పక్కన పెట్టిన బాటిళ్లను శుభ్రం చేయకుండా, మూత సరిగా పెట్టకుండా వదిలేయడం వల్ల బ్యాక్టీరియా, ఇతర సూక్ష్మజీవులు చేరే ప్రమాదం ఉందని డాక్టర్లు వివరిస్తున్నారు. కలుషితమైన ఆ మందును పిల్లలకు ఇస్తే తీవ్రమైన ఇన్ఫెక్షన్లు, జీర్ణాశయ సమస్యలు రావొచ్చని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యంగా తీపిగా ఉండే దగ్గు మందులు, ఇతర సిరప్‌లకు కీటకాలు, బల్లులు, చీమలు వంటివి సులభంగా ఆకర్షితమవుతాయి. అందుకే ప్రతిసారీ మందు వాడిన తర్వాత బాటిల్ మెడ భాగాన్ని, మూతను శుభ్రమైన గుడ్డతో తుడవాలి. తర్వాత మూతను గట్టిగా బిగించి, పిల్లలకు, పెంపుడు జంతువులకు అందని సురక్షితమైన ప్రదేశంలో భద్రపరచాలి. లేబుల్‌పై సూచిస్తే తప్ప సిరప్‌లను ఫ్రిజ్‌లో పెట్టవద్దని నిపుణులు సూచిస్తున్నారు.

మందుల రంగు, వాసన లేదా స్థితిలో ఏమాత్రం తేడా కనిపించినా వెంటనే పారవేయాలని వైద్యులు చెబుతున్నారు. ఈ చిన్నపాటి జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా అనవసరమైన ఆరోగ్య ప్రమాదాల నుంచి కుటుంబాన్ని కాపాడుకోవచ్చని వారు స్పష్టం చేస్తున్నారు.

# సరస్వతి పుష్కరాలకు ప్రత్యేక బస్సులు చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత

హైద్రాబాద్ (ఉప్పల్ ) సరస్వతి పుష్కరాల కోసం వెళ్లే భక్తులకు స్పెషల్ సర్వీసులు ఏర్పాటు చేసినట్లు చెంగిచెర్ల డిపో మేనేజర్ కే.కవిత తెలిపారు. కాళేశ్వరం, పుష్కరఘాట్, భద్రకాళి ఆలయం వంటి ప్రముఖ పుణ్య క్షేత్రాలకు పెద్దలకు రూ.1000, పిల్లలకు రూ.600గా నిర్ణయించినట్లు తెలిపారు. రేపు ఉదయం 7:00 గంటల నుంచి సర్వీసులు ఉంటాయని తెలిపారు.ఏవేని కాలనీ వాసులు 20,30 పుష్కరాలకు వెళుతామని తెలిపితే వారికోసం ప్రత్యేక బస్సు ను పైన్స్ పేర్కొన్న ఛార్జీలకే ఏర్పాటు చేయనున్నట్లు కవిత వివరించారు.మరిన్ని వివరాలకు 9110505820, 9948886516 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

# రోజూ గుడ్లు తినడం ఘోరం... ప్రొటీన్ కోసం ఈ 3 తినండి: సద్గురు ఆసక్తికర వ్యాఖ్యలు

**ప్రొటీన్, విటమిన్ బీ12 కోసం శాకాహారమే ఉత్తమమని వ్యాఖ్య**

**గుడ్లకు బదులుగా కొన్ని దక్షిణాది సంప్రదాయ వంటకాల సూచన**

**లక్ష్మీ చారు, పజయ సదం వంటివి తినడం మేలని హితవు**

**ప్రముఖ క్రీడాకారులు శాకాహారులేనని గుర్తుచేసిన సద్గురు**

ప్రముఖ ఆధ్యాత్మిక గురువు సద్గురు జగ్గీ వాసుదేవ్, ఆరోగ్యం మరియు ఆహారంపై తరచూ తనదైన శైలిలో విశ్లేషణలు అందిస్తుంటారు. తాజాగా ఆయన గుడ్ల వినియోగంపై చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. జిమ్ ట్రైనర్లు, పోషకాహార నిపుణులు, చివరికి ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) కూడా గుడ్లను పోషకాలు నిండిన సరసమైన ఆహారంగా సిఫార్సు చేస్తుండగా, సద్గురు దీనికి పూర్తి భిన్నమైన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తన ఇటీవలి ఇన్‌స్టాగ్రామ్ రీల్‌లో, రోజూ గుడ్లు తినడాన్ని "అత్యంత ఘోరమైన విషయం"గా ఆయన అభివర్ణించారు.



ఈక్వినాక్స్ (విషువత్తు- పగలు, రాత్రి సమానంగా ఉండే రోజు) తర్వాత కొంతమంది, ముఖ్యంగా మహిళల్లో శక్తి క్షీణించడం, నీరసంగా అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తాయని సద్గురు తెలిపారు. ఈ సమస్యను సరైన ఆహారంతో సరిదిద్దుకోకపోతే ఇబ్బందులు పెరుగుతాయన్నారు.

"ఒకప్పుడు మన ఇళ్లలోనే విటమిన్ బీ12 నిండిన ఎన్నో రకాల పదార్థాలను తయారు చేసుకుని తినేవాళ్లం. కానీ ఇప్పుడు బ్రెడ్, గుడ్లు వంటి వాటికి అలవాటు పడ్డాం" అని ఆయన ఆధునిక ఆహారపు అలవాట్లపై విమర్శలు గుప్పించారు.

ప్రోటీన్ కోసం గుడ్లు తినాలా?

"ప్రోటీన్ ఎక్కడి నుంచి వస్తుంది?" అనే ప్రశ్నకు సద్గురు ఆసక్తికరమైన సమాధానమిచ్చారు. "ప్రపంచంలో అత్యంత బలమైన కండరాలున్న జంతువులు శాకాహారులే కదా? అదేవిధంగా, ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన క్రీడాకారుల్లో చాలామంది శాకాహారులే" అని ఆయన గుర్తుచేశారు. ఉదాహరణగా నొవాక్ జొకోవిచ్, విరాట్ కోహ్లీ, లియోనెల్ మెస్సీ, టామ్ బ్రాడీ వంటి క్రీడా దిగ్గజాలను ఆయన ప్రస్తావించారు.

సద్గురు సూచించిన 3 సాంప్రదాయ వంటకాలు

గుడ్లకు ప్రత్యామ్నాయంగా ప్రోటీన్, విటమిన్ బీ12 పుష్కలంగా లభించే మూడు అద్భుతమైన దక్షిణ భారత సాంప్రదాయ వంటకాలను ఆయన సూచించారు.

1. లక్ష్మీ చారు (ఆంధ్రప్రదేశ్): ఇది మన తెలుగు రాష్ట్రాల్లోని ఒక సంప్రదాయ వంటకం. చింతపండు పులుసు, మసాలాలు, కరివేపాకు, పప్పుతో దీనిని తయారు చేస్తారు. కొన్ని ప్రాంతాల్లో అన్నం కడిగిన గంజి నీరు కూడా దీని తయారీకి ఉపయోగిస్తారు. పోషకాలను అందించే అద్భుతమైన వంటకం ఇది. వేడి అన్నంతో కలిపి తింటే దీని రుచి అమోఘంగా ఉంటుంది.

2. పళయ సదం (తమిళనాడు): మిగిలిపోయిన అన్నాన్ని రాత్రంతా నీటిలో నానబెట్టి పులియబెట్టడం ద్వారా ఈ వంటకాన్ని సిద్ధం చేస్తారు. ఇది వేసవిలో శరీరానికి చలువ చేస్తుంది. సహజసిద్ధమైన ఫెర్మెంటేషన్ ప్రక్రియ వల్ల ఇందులో ప్రోబయోటిక్స్ పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. దీనిని పెరుగు, ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, ఊరగాయతో కలిపి అల్పాహారంగా తీసుకుంటారు.

3. కూళ్ (తమిళనాడు/కర్ణాటక): రాగి, సజ్జ లేదా కంబు పిండిని పులియబెట్టి, నీళ్లు లేదా మజ్జిగతో కలిపి జావలా తయారుచేసే వంటకం ఇది. వేసవిలో శరీరాన్ని చల్లగా, హైడ్రేట్‌గా ఉంచుతుంది. ప్రోటీన్లు పుష్కలంగా ఉండే ఈ వంటకాన్ని ఉల్లిపాయలు, పచ్చిమిర్చి, ఊరగాయ వంటి వాటితో కలిపి తింటారు.

ప్రోటీన్ శరీర నిర్మాణానికి, కండరాల మరమ్మత్తుకు, రోగనిరోధక శక్తికి అత్యవసరం. విటమిన్ బీ12 నాడీ వ్యవస్థ, మెదడు పనితీరు, జ్ఞాపకశక్తికి కీలకం. దీని లోపం వల్ల రక్తహీనత, అలసట వంటి సమస్యలు వస్తాయి. ఈ నేపథ్యంలో, ఆధునిక ఫాస్ట్ ఫుడ్ సంస్కృతిని పక్కనపెట్టి, మన పూర్వీకులు అందించిన ఇలాంటి పోషకాలు నిండిన ఇంటి వంటకాలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చని సద్గురు సందేశమిచ్చారు.

# ఏసీలు ఎందుకు పేలుతాయి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

**ఏసీ ప్రమాదాలపై పెరుగుతున్న ఆందోళనలు**

**నిరంతర వాడకం వల్ల కంప్రెషర్లపై ఒత్తిడి**

**60 శాతం ప్రమాదాలకు షార్ట్ సర్క్యూట్లే కారణం**

**వోల్టేజ్ హెచ్చుతగ్గులు, గ్యాస్ లీకేజీల ముప్పు**

**ఏసీని 24-26 డిగ్రీల వద్ద ఉంచడం సురక్షితం**

ఢిల్లీలో మాజీ ఐఏఎస్ అధికారి ధనేంద్ర కుమార్ నివాసంలో ఏసీ పేలి మృతి చెందిన ఘటన దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఎండ తీవ్రత రికార్డు స్థాయిలో పెరుగుతున్న ప్రస్తుత తరుణంలో ఇళ్లలో ఎయిర్ కండిషనర్ల వాడకం పెరిగింది. అయితే సరైన నిర్వహణ లేకపోవడం, విద్యుత్ సరఫరాలో లోపాల వల్ల ఇవి ప్రాణాంతక బాంబులుగా మారుతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



ఏసీలు ఎందుకు పేలుతాయి?

కంప్రెషర్‌పై తీవ్ర ఒత్తిడి: ఎండలు ఎక్కువగా ఉన్నప్పుడు ఏసీలను గంటల తరబడి నిరంతరాయంగా ఆన్ చేసి ఉంచితే దానికి గుండె లాంటి 'కంప్రెషర్' తీవ్రంగా వేడెక్కుతుంది. దానికి తగినంత విరామం ఇవ్వకపోతే అంతర్గత ఉష్ణోగ్రత పెరిగి పేలుళ్లకు దారితీస్తుంది.

షార్ట్ సర్క్యూట్: ఎక్కువ సమయం కరెంట్ ప్రవహించడం వల్ల లోపలి వైర్లు కరిగిపోయి షార్ట్ సర్క్యూట్ అవుతుంది. సాధారణంగా ఇలాంటప్పుడు ఎంసీబీ ట్రిప్ అవ్వాలి. కానీ అది పాడైతే రక్షణ వ్యవస్థ విఫలమై మంటలు అంటుకుంటాయి.

వోల్టేజ్ హెచ్చుతగ్గులు: వేసవిలో విద్యుత్ వినియోగం పెరిగి వోల్టేజ్ ఒక్కసారిగా పెరగడం లేదా తగ్గడం వల్ల కంప్రెషర్లు దెబ్బతింటాయి. ఇన్వర్టర్ ఏసీలు లేదా స్టెబిలైజర్లు వాడకపోతే ఈ ముప్పు మరీ ఎక్కువ.

గ్యాస్ లీకేజీ, ఫిల్టర్లలో ధూళి: ఏసీ పైపుల నుంచి కూలింగ్ గ్యాస్ లీకైనా లేదా ఎయిర్ ఫిల్టర్లలో దుమ్ము పేరుకుపోయినా గాలి సరిగా ఆడదు. దీనివల్ల గదిని చల్లబర్చడానికి మెషీన్ సాధారణం కంటే ఎక్కువ శ్రమించాల్సి వస్తుంది. ఆ ఒత్తిడికి అంతర్గత భాగాలు వేడెక్కి కాలిపోతాయి.

ప్రమాదాన్ని గుర్తించడం ఎలా?

ఏసీలు ఒక్కసారిగా పేలిపోవు. ప్రమాదానికి ముందు కొన్ని సంకేతాలను గమనించొచ్చు. ఏసీ నుంచి అసాధారణ శబ్దాలు రావడం, పదే పదే ఆన్-ఆఫ్ అవడం, గది సరిగా చల్లబడకపోవడం, ఏసీ నుంచి మాడిన వాసన లేదా పొగ రావడం వంటివి జరిగితే అస్సలు నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే ఏసీని ఆపేసి టెక్నీషియన్ ద్వారా తనిఖీ చేయించాలి.

రక్షణ చర్యలు

ఏసీలను రోజంతా నిరంతరాయంగా వాడకుండా మధ్యలో కాసేపు బ్రేక్ ఇవ్వాలి. స్మార్ట్ టైమర్లను వాడుకోవడం మంచిది.

# ఆర్థికంగా మీ బలం ఎంత? ఈ 4 అంశాలతో చెప్పేయొచ్చు!

**లక్ష రూపాయల ఆకస్మిక ఖర్చును తట్టుకోగలగడం**
**అధిక వడ్డీ రుణాలకు దూరంగా ఉండటం**
**ఆదాయంలో 15-20 శాతం క్రమం తప్పకుండా పెట్టుబడి పెట్టడం**
**ధనవంతులుగా కనిపించాలనే ఒత్తిడికి లోనుకాకపోవడం**
**ఈ లక్షణాలుంటే చాలామంది భారతీయుల కంటే మీ ఆర్థిక పరిస్థితి మెరుగే**

మనం ఆర్థికంగా ఎంత స్థిరంగా ఉన్నా, ఇంకా ఏదో సాధించలేదనే అసంతృప్తి చాలామందిలో ఉంటుంది. ఖరీదైన కార్లు, విలాసవంతమైన వస్తువులు లేకపోతే తాము ధనవంతులం కానట్టేనని భావిస్తుంటారు. కానీ, ఆడంబరాలతో సంబంధం లేకుండా కొన్ని సాధారణ అలవాట్లే నిజమైన ఆర్థిక భద్రతకు సంకేతాలని ఆర్థిక నిపుణులు చెబుతున్నారు. మీరు అనుకున్నంతగా ధనవంతులు కాకపోయినా, చాలామంది భారతీయుల కంటే మెరుగైన స్థితిలో ఉన్నారనడానికి నాలుగు కీలక సూచికలు ఉన్నాయని నిపుణులు వివరిస్తున్నారు.



మీ ఆర్థిక బలాన్ని అంచనా వేసుకోవడానికి ఈ నాలుగు అంశాలను పరిశీలించుకోవాలి:

1. అత్యవసర నిధి: అకస్మాత్తుగా రూ.1 లక్ష రూపాయల ఖర్చు వస్తే, నెలవారీ బడ్జెట్‌ను దెబ్బతీయకుండా, అప్పు చేయకుండా ఆ మొత్తాన్ని చెల్లించగలరా? అలా చేయగలిగితే మీరు సరైన మార్గంలో ఉన్నట్టే. భారత్‌లో దాదాపు 75 శాతం మంది ఇలాంటి ఆకస్మిక ఖర్చులను తట్టుకోలేరని నిపుణులు పేర్కొన్నారు.

2. అప్పుల నిర్వహణ: గృహ రుణం వంటి మంచి అప్పులు మినహా, 10 శాతం కంటే ఎక్కువ వడ్డీ ఉండే వ్యక్తిగత రుణాలు, క్రెడిట్ కార్డు అప్పుల వంటివి లేకుండా చూసుకోవడం ముఖ్యం. అధిక వడ్డీలు మీ సంపదను హరించివేస్తాయి. కాబట్టి వాటికి దూరంగా ఉండేవారు ఆర్థికంగా స్థిరంగా ఉంటారు.


3. క్రమమైన పెట్టుబడులు: మీ ఆదాయంలో కనీసం 15-20 శాతం మొత్తాన్ని మ్యూచువల్ ఫండ్స్, స్టాక్స్, జాఖాలు,ౖాఖీ, జుాఖీ వంటి వాటిలో క్రమం తప్పకుండా పెట్టుబడి పెడుతున్నారా? చిన్న మొత్తమైనా సరే, నిరంతరం పెట్టుబడి పెట్టే అలవాటు దీర్ఘకాలంలో మిమ్మల్ని ఆర్థికంగా బలోపేతం చేస్తుంది.

4. ఆడంబరాలకు దూరం: ఇతరులకు ధనవంతులుగా కనిపించాలనే తాపత్రయానికి పోకుండా, మీ ఆర్థిక లక్ష్యాలపై దృష్టి పెట్టడం మరో ముఖ్యమైన లక్షణం. నిజంగా సంపదను సృష్టించేవారు అనవసరమైన ఖర్చులకు, జీవనశైలి ఆడంబరాలకు దూరంగా ఉంటారు.

భారత్‌లో అధిక జీవన వ్యయం, పెరుగుతున్న ఆకాంక్షల మధ్య చాలామంది ఆర్థిక ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో, ఇతరులతో పోల్చుకోకుండా, ఈ నాలుగు అంశాలలో మీ పురోగతిని సమీక్షించుకోవడం ద్వారా నిజమైన ఆర్థిక భద్రతను అంచనా వేసుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

# చిన్న పొరపాట్లే పెద్ద శాపాలు.. మీ ఎదుగుదలను అడ్డుకునే 11 అలవాట్లు ఇవే!

**నిత్యం చేసే చిన్న పొరపాట్లే ప్రగతికి అవరోధాలు**
**సమాజం మెచ్చే కొన్ని అలవాట్లు విషపూరితం**
**సోషల్ మీడియా స్క్రోలింగ్ నిజమైన విశ్రాంతి కాదు**
**పర్ఫెక్ట్ సమయం కోసం చూస్తే పనులు వాయిదా**
**రోజువారీ 1% మార్పులే పెద్ద విజయాలకు పునాది**



చాలా మంది తమ జీవితంలో ఆశించిన స్థాయిలో విజయం సాధించలేకపోవడానికి ఏదో ఒక పెద్ద తప్పిదం కారణమని భావిస్తారు. కానీ వాస్తవానికి మనం నిత్యం గమనించకుండా పునరావృతం చేసే చిన్న అలవాట్లే మన ఎదుగుదలను అడ్డుకుంటున్నాయని మానసిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. సమాజం గొప్పగా చూసే కొన్ని అలవాట్లు కూడా మనల్ని మానసికంగా అలసిపోయేలా చేసి జీవితంలో ముందుకు సాగకుండా వెనక్కి లాగుతున్నాయి.

ఆ 11 అలవాట్లు ఇవే...

1. బిజీగా బతకడాన్ని గొప్పగా చెప్పుకోవడం: రాత్రి తక్కువ సమయం పడుకోవడం, నిరంతరం ఒత్తిడితో బతకడాన్ని ఒక హోదాగా చెప్పుకోవడం ఒక పెద్ద భ్రమ. ఇది మీ శరీరం ఇస్తున్న ప్రమాద సంకేతం.

2. 'మూడ్' కోసం ఎదురుచూడటం: ప్రేరణ వచ్చినప్పుడే పని మొదలుపెట్టాలి అనుకోవడం వల్ల పనులు వాయిదా పడతాయి. చిన్నగానైనా సరే పని మొదలుపెడితే వేగం దానంతట అదే వస్తుంది.

3. ప్రతిదానికీ 'యెస్' చెప్పడం: మొహమాటానికి పోయి ప్రతిదానికీ 'అవును' అనడం వల్ల మీ ప్రశాంతత దెబ్బతింటుంది. మర్యాదగా 'నో' చెప్పడం నేర్చుకోవడం మీ సమయాన్ని కాపాడుతుంది.

4. ఇతరులతో పోల్చుకోవడం: సోషల్ మీడియా కేవలం ఇతరుల జీవితంలోని బెస్ట్ మూమెంట్స్ మాత్రమే చూపించే మ్యూజియం. మీ తెరవెనక కష్టాలను వారి షోఆఫ్‌తో పోల్చుకోవద్దు.

5. ప్రతి తప్పును ఆపాదించుకోవడం: ఓ పనిలో ఫెయిల్ అయితే 'నేనే ఒక ఫెయిల్యూర్' అని ఫిక్స్ అయిపోవడం వల్ల కొత్త పనులు చేయడానికి భయం వేస్తుంది. తప్పులు కేవలం పాఠాలు మాత్రమే.

6. పర్ఫెక్ట్‌గా ఉండాలని పట్టుబట్టడం: పర్ఫెక్ట్ ప్లాన్ లేదా సరైన సమయం కోసం ఎదురుచూడటం అనేది ఓడిపోతామనే భయానికి ఇంకో రూపం. రంగంలోకి దిగి, తప్పులు చేస్తూ వాటిని సరిదిద్దుకోవాలి.

7. రీల్స్ చూస్తూ రెస్ట్ అనుకోవడం: గంటల తరబడి సోషల్ మీడియా స్క్రోల్ చేయడం వల్ల మైండ్ రిలాక్స్ అవ్వదు. మరింత అలసిపోతుంది. ఫోన్ లేకుండా గడపడమే నిజమైన విశ్రాంతి.

8. కష్టమైన సంభాషణలను దాటవేయడం: ఎదుటివారితో వచ్చే సమస్యలను మాట్లాడకుండా దాటవేస్తే అవి లోపల అలాగే ఉండిపోయి భవిష్యత్తులో బంధాలు పూర్తిగా తెగిపోయే ప్రమాదం ఉంది.

9. టు-డూ లిస్ట్‌తో ముడిపెట్టడం: రోజంతా పనులు చేస్తూనే ఉండాలనుకోవద్దు. ఖాళీగా కూర్చుంటే అపరాధభావం కలగడం తప్పు. మీరు మనిషి. ఫ్యాక్టరీలో వస్తువులు తయారు చేసే మెషీన్ కాదు.

10. అందరికీ అందుబాటులో ఉండటం: ఆఫీస్ పనికైనా, ఫ్రెండ్స్‌కైనా 24 గంటలూ అందుబాటులో ఉండటం వల్ల మీ శక్తి హరించుకుపోతుంది. మీకంటూ కొన్ని సరిహద్దులు గీసుకోవాలి.

11. చిన్న పనులే... కానీ!: రోజుకు 10 నిమిషాలు నడవడం లేదా పుస్తకం చదవడం వల్ల అప్పటికప్పుడు ఫలితం కనిపించకపోవచ్చు. కానీ ఏడాది పాటు వీటిని కొనసాగిస్తే జీవితంలో ఊహించని పెద్ద విజయాలు వస్తాయి.

# బంగారం కొంటున్నారా? ఈ కోడ్‌ను తప్పనిసరిగా చెక్ చేసుకోండి!

**బంగారు నగలకు అమలవుతున్న 6 అంకెల హెచ్ యూఐడీ కోడ్**
**మోసాల నుంచి వినియోగదారులను కాపాడేందుకు ప్రభుత్వ చర్య**
**బీఐఎస్ కేర్ యాప్ ద్వారా హెచ్ యూఐడీ కోడ్ వివరాలు తెలుసుకునే సౌలభ్యం**
**హాల్‌మార్క్‌తో పాటు హెచ్ యూఐడీ కోడ్‌ను కూడా తప్పక పరిశీలించాలని సూచన**

బంగారు ఆభరణాలు కొనుగోలు చేసేటప్పుడు హాల్‌మార్క్ చూడటం మనకు అలవాటు. కానీ ఇప్పుడు అంతకంటే ముఖ్యమైనది మరొకటి ఉంది. అదే హెచ్ యూఐడీ (ఎఖ×ఐ) కోడ్. హాల్‌మార్క్‌తో పాటు ఈ ప్రత్యేక కోడ్‌ను సరిచూసుకోకపోతే, అసలు బంగారం కొంటున్నామనే భరోసా ఉండదు. నకిలీల బారిన పడి నష్టపోయే ప్రమాదం ఉంది.

ఏమిటీ హెచ్ యూఐడీ కోడ్?

హాల్‌మార్క్ యూనిక్ ఐడెంటిఫికేషన్ (ఎఖ×ఐ) అనేది ప్రతి ఆభరణానికి ప్రత్యేకంగా ఇచ్చే 6 అంకెల ఆల్ఫాన్యూమరిక్ కోడ్ (అక్షరాలు, సంఖ్యల కలయిక). దీన్ని నగపై లేజర్‌తో ముద్రిస్తారు. జూలై 1, 2021 నుంచి ప్రతీ హాల్‌మార్క్ ఆభరణంపై మూడు గుర్తులు తప్పనిసరిగా ఉంటున్నాయి. అవి: బీఐఎస్ (దీ×ూ) లోగో, బంగారం స్వచ్ఛతను తెలిపే మార్క్ (ఉదా: 22ఖ916), మరియు ఈ హెచ్ యూఐడీ కోడ్.



ఎందుకు తనిఖీ చేయాలి?

నకిలీ హాల్‌మార్క్ ముద్రలతో మోసాలు జరుగుతున్న నేపథ్యంలో, హెచ్ యూఐడీ కోడ్ అదనపు భద్రతను ఇస్తుంది. ఈ కోడ్ ప్రతి ఆభరణానికి ప్రత్యేకంగా ఉండి, అధికారిక బీఐఎస్ డేటాబేస్‌లో నమోదై ఉంటుంది. దీనివల్ల నకిలీలు తయారుచేయడం కష్టం. ఈ కోడ్ ద్వారా ఆభరణాన్ని ఎవరు తయారు చేశారు, ఎక్కడ హాల్‌మార్క్ చేశారు, దాని స్వచ్ఛత ఎంత వంటి వివరాలు పారదర్శకంగా తెలుసుకోవచ్చు. తక్కువ నాణ్యత గల బంగారం అంటగట్టే మోసాల నుంచి ఇది వినియోగదారులను కాపాడుతుంది.

సరిచూసుకోవడం ఎలా?

ఆభరణంపై దీ×ూ లోగో, స్వచ్ఛత గుర్తు పక్కనే ఉన్న 6 అంకెల హెచ్ యూఐడీ కోడ్‌ను గమనించాలి. తర్వాత మీ స్మార్ట్‌ఫోన్‌లో 'దీ×ూ ఋుతీవ' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. యాప్ ఓపెన్ చేసి, »Verify HUIDµ ఆప్షన్‌ను ఎంచుకుని, ఆ కోడ్‌ను ఎంటర్ చేస్తే చాలు. ఆ నగకు సంబంధించిన పూర్తి వివరాలు (నగ రకం, జ్యూయలర్ పేరు, హాల్‌మార్కింగ్ సెంటర్, స్వచ్ఛత) కనిపిస్తాయి. కొనుగోలు చేసేటప్పుడే కాకుండా, బంగారంపై రుణం తీసుకునే సమయంలోనూ ఇది ఉపయోగపడుతుంది. కాబట్టి, ఇకపై బంగారం కొనేటప్పుడు హాల్‌మార్క్‌తో పాటు హెచ్ యూఐడీ కోడ్‌ను తప్పకుండా సరిచూసుకోండి.

# కోటీశ్వరుల ఇళ్లలో కొత్త ఉద్యోగాలు.. ఎవరీ లైఫ్ స్టైల్ మేనేజర్లు?

**భారత సంపన్న వర్గాల్లో లైఫ్‌స్టైల్ మేనేజర్లకు పెరుగుతున్న డిమాండ్**
**వంటవాళ్లు, డ్రైవర్లకే పరిమితం కాకుండా సమగ్ర వ్యక్తిగత సేవలు**
**ఇంటి పనుల పర్యవేక్షణ నుంచి ఈవెంట్ల నిర్వహణ వరకు వీరి బాధ్యతలు**
**ఈ సేవలకు లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్న ప్రత్యేక సంస్థలు**
**పని ఒత్తిడి తగ్గించుకుని కుటుంబంతో గడిపేందుకు మొగ్గుచూపుతున్న సంపన్నులు**

భారతదేశంలో సంపద వేగంగా పెరుగుతున్న కొద్దీ, సంపన్నుల జీవనశైలి, అవసరాలు కూడా అంతే వేగంగా మారుతున్నాయి. ఒకప్పుడు వంటవాళ్లు, డ్రైవర్లు, ఆయాలతో సరిపెట్టుకున్న శ్రీమంతులు, ఇప్పుడు తమ దైనందిన జీవితంలోని సంక్లిష్టతలను నిర్వహించడానికి ప్రొఫెషనల్ "లైఫ్‌స్టైల్ మేనేజర్ల" వైపు చూస్తున్నారు. ఇది దేశంలోని సంపన్న వర్గాలలో మొదలైన సరికొత్త ట్రెండ్‌గా నిలుస్తోంది. కేవలం ఇంటి పనులకే పరిమితం కాకుండా, తమ జీవితంలోని ప్రతి చిన్న విషయాన్ని సమన్వయం చేసే సమర్థవంతమైన వ్యక్తిగత సహాయకుల కోసం వారు అన్వేషిస్తున్నారు.



దేశంలో కొత్త బిలియనీర్లు, అధిక నికర విలువ కలిగిన వ్యక్తులు సంఖ్య గణనీయంగా పెరగడమే ఈ మార్పుకు ప్రధాన కారణం. ఆధునిక జీవనశైలితో వచ్చే ఒత్తిడి, తీవ్రమైన పనిభారం, సామాజిక బాధ్యతల నడుమ వారికి వ్యక్తిగత జీవితాన్ని చక్కదిద్దుకోవడం కష్టంగా మారుతోంది. ఈ నేపథ్యంలో, లైఫ్‌స్టైల్ మేనేజర్లు వారి జీవితాల్లోకి ప్రవేశించి, కీలక బాధ్యతలను స్వీకరిస్తున్నారు. ఇంట్లోని ఇతర సిబ్బందిని పర్యవేక్షించడం, వెండర్లతో మాట్లాడటం, ఉన్నత స్థాయి పార్టీలు లేదా ఇతర కార్యక్రమాలను ప్లాన్ చేయడం, విదేశీ ప్రయాణ ఏర్పాట్లు, పిల్లల స్కూల్ వ్యవహారాలు, చివరికి తమ యజమానుల ఆరోగ్యం, వెల్‌నెస్ రొటీన్‌లను కూడా వీరే చూసుకుంటున్నారు. అత్యవసర సమయాల్లో చివరి నిమిషంలో తలెత్తే అవసరాలను కూడా తీరుస్తూ నమ్మకమైన అండగా నిలుస్తున్నారు.

ఈ డిమాండ్‌ను అందిపుచ్చుకోవడానికి గుర్గావ్‌కు చెందిన 'పించ్', 'ఎలైట్‌బట్లర్స్', బెంగళూరులోని 'క్లబ్ కాన్సర్జ్', గోవాలోని 'ఇండల్జ్ కాన్సర్జ్' వంటి ప్రత్యేక సంస్థలు పుట్టుకొచ్చాయి. ఈ సంస్థలు హాస్పిటాలిటీ, లాజిస్టిక్స్, క్లయింట్ రిలేషన్స్‌లో శిక్షణ పొందిన నిపుణులను నియమించుకుంటున్నాయి. ఢిల్లీ-ఎన్‌సీఆర్, ముంబై వంటి మెట్రో నగరాల్లోని అల్ట్రా-రిచ్ కుటుంబాలకు ఈ సేవలను అందిస్తున్నాయి. ఈ సేవలు పొందడానికి వార్షిక సభ్యత్వం కింద కొన్ని లక్షల రూపాయల వరకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇది సమయానికి, ప్రత్యేకతకు వారు ఇచ్చే విలువను సూచిస్తోంది.

నిపుణుల అభిప్రాయం ప్రకారం, లైఫ్‌స్టైల్ మేనేజర్లు కేవలం ఉద్యోగులుగా కాకుండా, ఆ కుటుంబ యజమానులకు ఒక స్నేహితుడిగా, సలహాదారుడిగా, నమ్మకమైన వ్యక్తిగా వ్యవహరిస్తున్నారు. భావోద్వేగాలను అర్థం చేసుకుంటూనే, పనులను పూర్తి చేయడంలో వీరి నైపుణ్యం కీలకం. అందుకే వీరిని కుటుంబంలో ఒకరిగా భావిస్తున్నారు. ఈ సేవ వల్ల సంపన్నులు తమపై ఉన్న మానసిక భారాన్ని తగ్గించుకుని, వ్యాపారం, కుటుంబం, వ్యక్తిగత ఆసక్తులపై దృష్టి పెట్టడానికి వీలు కలుగుతోంది. ఇది వారి జీవితంలో ప్రశాంతతను, సమతుల్యతను తీసుకువస్తోందని విశ్లేషకులు చెబుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న ఈ ట్రెండ్, ఇప్పుడు భారతదేశంలో ఒక వ్యవస్థీకృత రంగంగా రూపుదిద్దుకుంటోంది.

# సింగిల్ ఛార్జ్‌తో 543 కిలోమీటర్ల మైలేజ్.. టయోటా తొలి ఎలక్ట్రిక్ కార్ 'ఎబెల్లా'!

**బ్యాటరీ సామర్థ్యం 61 కిలోవాట్ అవర్స్**
**ప్రారంభ ధర రూ.23.60 లక్షలు**
**గరిష్ఠంగా 171 హార్స్ పవర్ శక్తిని, 189 న్యూటన్ మీటర్ల టార్క్**
**7 ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీల కెమెరా**
**'లెవెల్ 2 ఏడీఏఎస్' సాంకేతికత**

టయోటా కిర్లోస్కర్ మోటార్ భారత ఆటోమొబైల్ మార్కెట్లోకి తన తొలి పూర్తి స్థాయి ఎలక్ట్రిక్ కారు 'అర్బన్ క్రూయిజర్ ఎబెల్లా'ను విడుదల చేసింది. ఈ మిడ్-సైజ్ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ టాప్ వేరియంట్ 'జు3' ధరను రూ.23.60 లక్షలు (ఎక్స్-షోరూమ్)గా కంపెనీ నిర్ణయించింది. మారుతీ సుజుకీ 'ఈ-విటారా' ప్లాట్‌ఫామ్ ఆధారంగా రూపొందిన ఈ కారు.. మార్కెట్లో ఉన్న హ్యుందాయ్ క్రెటా ఎలక్ట్రిక్, ఎంజీ జెడ్ఎస్ ఈవీ, టాటా కర్వ్ ఈవీలకు గట్టి పోటీ ఇవ్వనుంది.



అదిరిపోయే మైలేజ్

ఇందులో 61 కిలోవాట్ అవర్స్ (కేడబ్ల్యూహెచ్) సామర్థ్యం గల శక్తిమంతమైన బ్యాటరీ ప్యాక్‌ను అమర్చారు. దీన్ని ఒక్కసారి ఛార్జ్ చేస్తే ఏకంగా 543 కిలోమీటర్ల దూరం ప్రయాణించవచ్చని కంపెనీ తెలిపింది. ఈ కారు గరిష్ఠంగా 171 హార్స్ పవర్ శక్తిని, 189 న్యూటన్ మీటర్ల టార్క్‌ను విడుదల చేస్తుంది. స్పోర్టివ్ లుక్‌తో ఉన్న ఈ కారును కేఫ్ వైట్, బ్లూయిష్ బ్లాక్, స్పోర్టింగ్ రెడ్ వంటి ఆకర్షణీయమైన రంగుల్లో తీసుకొచ్చారు.

లగ్జరీ ఇంటీరియర్

కారు లోపలి భాగం బ్లాక్, బ్రౌన్ కలర్ కాంబినేషన్‌తో ఎంతో విలాసవంతంగా ఉంటుంది. ఇందులో పనోరమిక్ సన్‌రూఫ్, 10.1 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, వెంటిలేటెడ్ సీట్లు, వైర్‌లెస్ ఛార్జింగ్, జేబీఎల్ సౌండ్ సిస్టమ్, ఎయిర్ ప్యూరిఫైయర్ వంటి ఎన్నో ఆధునిక ఫీచర్లు ఉన్నాయి. ప్రయాణికుల భద్రత కోసం ఈ కారులో ఏకంగా 7 ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీల కెమెరాతో పాటు ప్రమాదాలను ముందుగానే గుర్తించి ఆపే 'లెవెల్ 2 ఏడీఏఎస్' సాంకేతికతను కూడా అందించారు.

# 50 శాతం పడిపోయిన ఎల్ఐసీ షేరు విలువ.. అసలు విషయం ఇదీ!

**ఎల్ఐసీ తొలిసారి బోనస్ షేర్ల జారీ**
**1:1 నిష్పత్తిలో బోనస్ ప్రకటన**
**ధర సగానికి తగ్గినట్లు కనిపించిన షేరు**
**మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో మార్పు లేదు**
**రికార్డు తేదీ నాటికే అర్హత నిర్ధారణ**

'లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా' (ఎల్ఐసీ) షేర్లు శుక్రవారం ట్రేడింగ్‌లో దాదాపు 50 శాతం పడిపోయినట్లు కనిపించడంతో ఇన్వెస్టర్లు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. బుధవారం నాటి ముగింపు ధర రూ.830తో పోలిస్తే శుక్రవారం ఎన్ఎస్ఈలో ఈ షేరు రూ.417.60 వద్ద ప్రారంభమైంది. అయితే ఇది షేరు కుప్పకూలడం కాదు. ఎల్ఐసీ తొలిసారిగా ప్రకటించిన 1:1 బోనస్ షేర్ల సర్దుబాటు ప్రక్రియ మాత్రమే. వాస్తవానికి ఈ షేరు కేవలం 1.5 శాతం నష్టంతో రూ.411.45 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది.




ఏంటీ బోనస్ లెక్క?

ఎల్ఐసీ తన ఇన్వెస్టర్లకు ఒక షేరుకు బదులుగా మరొక షేరును ఉచితంగా బోనస్‌గా ఇవ్వాలని గత ఏప్రిల్‌లోనే నిర్ణయించింది. ఇందుకోసం మే 29ని రికార్డు తేదీగా నిర్ణయించింది. బోనస్ షేర్ల జారీ వల్ల మార్కెట్లో కంపెనీ మొత్తం షేర్ల సంఖ్య రెట్టింపు అవుతుంది. కానీ కంపెనీ మార్కెట్ విలువలో ఎలాంటి మార్పు ఉండదు. దీనివల్ల షేరు ధర సగానికి తగ్గుతుంది. ఫలితంగా సామాన్య ఇన్వెస్టర్లకు కూడా ఈ షేరు అందుబాటులోకి వచ్చి మార్కెట్లో దీని కొనుగోళ్లు, అమ్మకాలు పెరుగుతాయి.

ఎవరు అర్హులు?

మే 29 నాటికి ఎవరి డీమ్యాట్ ఖాతాలో అయితే ఎల్ఐసీ షేర్లు ఉంటాయో వారే ఈ బోనస్ షేర్లు పొందడానికి అర్హులు. సెబీ నిబంధనల ప్రకారం.. రికార్డు తేదీ కంటే ఒక రోజు ముందే షేర్లు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే గురువారం బక్రీద్ సందర్భంగా మార్కెట్లకు సెలవు కావడంతో, బుధవారమే ఎల్ఐసీ షేర్లు కొనుగోలు చేసిన వారికి మాత్రమే ఈ బోనస్ స్టాక్స్ దక్కుతాయి. 2022 మే నెలలో స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టిన ఎల్ఐసీ తన 21 లక్షల మందికిపైగా ఉన్న ఇన్వెస్టర్లకు బోనస్ షేర్లు ఇవ్వడం ఇదే తొలిసారి.

# బ్యాటరీ ఆందోళనకు చెక్.. యూజర్ల నమ్మకాన్ని గెలుస్తున్న 'రియల్‌మీ పీ సిరీస్'

**స్మార్ట్‌ఫోన్ వినియోగంలో పెరిగిన బ్యాటరీ ప్రాధాన్యత**
**యూజర్ల బ్యాటరీ ఆందోళనను లక్ష్యంగా చేసుకున్న రియల్‌మీ పీ సిరీస్**
**భారత్‌లో తొలి 10,001ఎంఏహెచ్ బ్యాటరీ ఫోన్‌తో సంచలనం**
**అదే వారసత్వాన్ని కొనసాగించనున్న కొత్త రియల్‌మీ పీ4ఆర్**
**మిడ్-రేంజ్ విభాగంలో బ్యాటరీ పనితీరులో కొత్త ప్రమాణాలు**

భారత స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో కేవలం స్పెసిఫికేషన్ల జాబితా చూసి ఆకట్టుకునే రోజులు పోయాయి. ఇప్పుడు వినియోగదారులు, ముఖ్యంగా యువతరం, నిజమైన పనితీరుకే ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ క్రమంలో స్మార్ట్‌ఫోన్ ఎంపికలో బ్యాటరీ లైఫ్ అత్యంత కీలకమైన అంశంగా మారింది. గేమింగ్, స్ట్రీమింగ్ నుంచి ఆఫీస్ పనుల వరకు రోజంతా నిరంతరాయంగా పనిచేసే ఫోన్‌లనే నేటితరం కోరుకుంటోంది.




ఈ మార్పును ముందుగానే గ్రహించిన రియల్‌మీ, తన పీ సిరీస్‌తో మిడ్-రేంజ్ సెగ్మెంట్‌లో సరికొత్త అధ్యాయాన్ని లిఖిస్తోంది. గతంలో మిడ్-రేంజ్ ఫోన్ కొనాలంటే పనితీరు, డిజైన్ లేదా బ్యాటరీ లైఫ్.. ఈ మూడింటిలో ఏదో ఒకదానితో రాజీ పడాల్సి వచ్చేది. ఈ లోటును భర్తీ చేయాలన్న లక్ష్యంతోనే రియల్‌మీ పీ సిరీస్ ప్రారంభమైంది. స్టైలిష్ డిజైన్, బలమైన పనితీరుతో పాటు అత్యుత్తమ బ్యాటరీ లైఫ్‌ను అందించడం ద్వారా ఈ సిరీస్ అనతికాలంలోనే ఆన్‌లైన్ మార్కెట్‌లో బలమైన ముద్ర వేసింది. పీ1 సిరీస్‌తో పునాది వేసి, పీ2, పీ3 సిరీస్‌లతో డిస్‌ప్లే, యూజర్ ఎక్స్‌పీరియన్స్‌ను మరింత మెరుగుపరుస్తూ వచ్చింది.

మారుతున్న వినియోగదారుల అవసరాలకు అనుగుణంగా, రియల్‌మీ 'బ్యాటరీ ఆందోళన' సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడంపై దృష్టి సారించింది. పదేపదే ఫోన్ ఛార్జ్ చేయడం, పవర్ బ్యాంక్‌లు వెంట తీసుకెళ్లడం వంటి ఇబ్బందులను అధిగమించేలా ఫోన్‌లను రూపొందించింది. ఈ వ్యూహంలో భాగంగానే రియల్‌మీ పీ4 పవర్ స్మార్ట్‌ఫోన్‌ను భారత్‌లో మొట్టమొదటి 10,001ఎంఏహెచ్ బ్యాటరీతో విడుదల చేసి సంచలనం సృష్టించింది. ఇది కేవలం పెద్ద బ్యాటరీ మాత్రమే కాదు, మిడ్-రేంజ్ విభాగంలో బ్యాటరీ సామర్థ్యంపై అంచనాలను పూర్తిగా మార్చేసిన ఒక ముందడుగు.

ఈ విజయ పరంపరను కొనసాగిస్తూ, రియల్‌మీ ఇప్పుడు తన తదుపరి మోడల్ పీ4ఆర్ ను తీసుకురావడానికి సిద్ధమవుతోంది. పీ4 పవర్ నెలకొల్పిన బలమైన పునాదిపై ఈ కొత్త స్మార్ట్‌ఫోన్ రానుంది. ఈ సెగ్మెంట్‌లో అత్యుత్తమ బ్యాటరీ పనితీరును అందించడంతో పాటు, రోజువారీ వాడకంలో మృదువైన అనుభూతిని ఇవ్వడం దీని లక్ష్యం. ఒకప్పుడు వినియోగదారుల అవసరాలకు స్పందించిన రియల్‌మీ పీ సిరీస్, ఇప్పుడు మిడ్-రేంజ్ స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌లో బ్యాటరీ పనితీరుకు కొత్త ప్రమాణాలను నిర్దేశిస్తూ నాయకత్వ స్థానంలో నిలుస్తోంది.

# కోల్‌గేట్ టూత్‌పేస్ట్ ధరల పెంపు.. ఎంత పెరిగాయంటే..!

**టూత్‌పేస్ట్ ధరలను పెంచిన ప్రముఖ ఎఫ్ఎంసీజీ సంస్థ కోల్‌గేట్**
**ముడిసరుకులు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడమే ప్రధాన కారణం**
**పాపులర్ వేరియంట్లపై 4 నుంచి 5 శాతం వరకు ధరల పెంపు**
**కొన్ని ప్యాక్‌లపై ధరలతో పాటు పరిమాణాన్ని కూడా పెంచిన సంస్థ**
**ప్రీమియం ఉత్పత్తులపై మరింత ఎక్కువగా ధరలను పెంచిన వైనం**



ప్రముఖ ఫాస్ట్-మూవింగ్ కన్స్యూమర్ గూడ్స్ (ఎఫ్ఎంసీజీ) సంస్థ కోల్‌గేట్-పామోలివ్ ఇండియా తమ టూత్‌పేస్ట్ ధరలను పెంచింది. మే నెలలో పలు రకాల టూత్‌పేస్ట్ ప్యాక్‌లపై 4 నుంచి 5 శాతం వరకు ధరలను పెంచినట్లు శుక్రవారం వెల్లడించింది. ముడిసరుకులు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరగడమే ఈ పెంపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది.

ఎన్డీటీవీ ప్రాఫిట్ కథనం ప్రకారం కోల్‌గేట్ డెంటల్ క్రీమ్, మ్యాక్స్ ఫ్రెష్ వంటి పాపులర్ వేరియంట్లపై ఈ ధరల పెంపు ప్రభావం పడింది. కొత్త ధరల వివరాలను పరిశీలిస్తే, కోల్‌గేట్ డెంటల్ క్రీమ్ 200గ్రా ం 100గ్రా ం టూత్‌బ్రష్ ప్యాక్ ధర రూ.8 పెరిగి రూ.208కి చేరింది. అలాగే, 200 గ్రాముల డెంటల్ క్రీమ్ ప్యాక్ ధర రూ.5 పెరిగి రూ.135 అయింది.

ఇక, 100 గ్రాముల డెంటల్ క్రీమ్ ప్యాక్ ధరను రూ.3 పెంచి రూ.73కి చేర్చగా, దాని పరిమాణాన్ని కూడా 10 శాతం పెంచడం గమనార్హం. కోల్‌గేట్ మ్యాక్స్ ఫ్రెష్ బ్లూ 70గ్రా ప్యాక్ ధర రూ.4 పెరిగి రూ.83కి చేరింది. అయితే, ప్రీమియం ఉత్పత్తులపై ధరల పెంపు మరింత ఎక్కువగా ఉంది. విజిబుల్ వైట్ పర్పుల్ 200గ్రా ప్యాక్ ధర ఏకంగా రూ.17 పెరిగి రూ.395కి చేరుకుంది.

తక్కువ ధర కలిగిన ప్యాక్‌ల ధరలను మాత్రం ప్రస్తుతానికి పెంచే అవకాశం లేదని డిస్ట్రిబ్యూటర్లు చెబుతున్నారు. సామాన్య ప్రజలు ఎక్కువగా కొనే ఈ ఉత్పత్తుల ధరల విషయంలో కంపెనీలు సున్నితంగా వ్యవహరిస్తాయని తెలిపారు. కాగా, కోల్‌గేట్-పామోలివ్ ఇండియా మొత్తం ఆదాయంలో దాదాపు 80 శాతం వాటా టూత్‌పేస్ట్ అమ్మకాల నుంచే వస్తుంది.

# బరువు తగ్గేందుకు ఓజెంపిక్ ఇంజెక్షన్ తీసుకుంటున్నారా? అయితే ఇది చదవండి!

**బరువు తగ్గించే మందులతో కొవ్వుతో పాటు కండరాలు కూడా కరుగుతాయి ,వ్యాయామం జోడిస్తే కండరాల నష్టాన్ని నివారించవచ్చని తాజా అధ్యయనం**
**మందులతో పాటు వ్యాయామం చేస్తే కొవ్వు వేగంగా కరిగి, బలం పెరుగుతుంది ,గుండె, కాలేయ ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని పరిశోధనలో వెల్లడి**
**మందులపైనే ఆధారపడకుండా శారీరక శ్రమ తప్పనిసరి అని నిపుణుల సూచన**

బరువు తగ్గడం కోసం ఓజెంపిక్ (సెమగ్లూటైడ్) వంటి +ూ-1 మందుల వాడకం ఇటీవల బాగా పెరిగింది. అయితే, ఈ మందులు వాడుతున్న వారు వ్యాయామం చేయకపోతే తీవ్రమైన నష్టాలు తప్పవని ఓ కొత్త అధ్యయనం హెచ్చరిస్తోంది. వేగంగా బరువు తగ్గే క్రమంలో కొవ్వుతో పాటు కీలకమైన కండర కణజాలం కూడా కరిగిపోతుందని, ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యానికి హానికరమని స్పష్టం చేస్తోంది.

అధ్యయనంలో ఏం తేలింది?

యూరోపియన్ ఎథెరోస్క్లెరోసిస్ సొసైటీ (జూూూ) కాంగ్రెస్‌లో సమర్పించిన ఈ అధ్యయనం కోసం జంతువులపై 14 వారాల పాటు పరిశోధన జరిపారు. కొన్నింటికి కేవలం సెమగ్లూటైడ్ మందులు ఇవ్వగా, మరికొన్నింటికి మందులతో పాటు వ్యాయామం కూడా చేయించారు. ఫలితాలు ఆశ్చర్యకరమైన తేడాలను చూపించాయి. కేవలం మందులు వాడినవి 31 శాతం కొవ్వును కోల్పోవడంతో పాటు, 11 శాతం కండరాలను కూడా నష్టపోయాయి. అదే సమయంలో, మందులతో పాటు వ్యాయామం చేసినవి 45 శాతం కొవ్వును కోల్పోయి, కేవలం 8 శాతం కండరాలను మాత్రమే నష్టపోయాయి. అంటే, వ్యాయామం చేయడం వల్ల కండరాల నష్టం గణనీయంగా తగ్గి, కొవ్వు మరింత వేగంగా కరిగింది.

వ్యాయామంతో అదనపు ప్రయోజనాలు

వ్యాయామం జోడించడం వల్ల కేవలం కండరాల పరిరక్షణే కాకుండా మరిన్ని ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని ఈ అధ్యయనం తేల్చింది. వ్యాయామం చేసిన వాటిలో శారీరక బలం పెరగడం, రక్తనాళాల్లో కొవ్వు ఫలకాలు తగ్గడం, కాలేయం, కొవ్వు కణజాలంలో వాపు తగ్గడం వంటి మార్పులను గమనించారు. ఇది ఫ్యాటీ లివర్, టైప్ 2 డయాబెటిస్ వంటి సమస్యల నుంచి మెరుగైన రక్షణ కల్పిస్తుంది.

నిపుణుల ప్రకారం, బరువు తగ్గించే మందులు ఆకలిని నియంత్రించి బరువు పరిమాణాన్ని తగ్గిస్తాయి. కానీ, వ్యాయామం మాత్రమే ఆ బరువు తగ్గే నాణ్యతను నిర్ధారిస్తుంది. అందుకే, ఈ మందులు వాడేవారు కచ్చితంగా వ్యాయామం, ముఖ్యంగా బరువులు ఎత్తడం వంటివి చేస్తూ, తగినంత ప్రోటీన్ తీసుకోవడం తప్పనిసరి.

# ‘రైతు డిస్కం’ తో వ్యవసాయానికి ఉరితాడు.. 24 గంటల కరెంట్ ఇస్తేనే ఓట్లు అడుగుతానని సీఎం ప్రమాణం చేయాలిమాజీ మంత్రి హరీశ్ రావు



**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి:**

పగలు మాత్రమే ఉండే సోలార్ పవర్ తో 24 గంటల కరెంట్ ఎలా ఇస్తారో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి.

ఆర్పీడీసీఎల్ ఏర్పాటుతో లిఫ్ట్ ఇరిగేషన్, మిషన్ భగీరథ ప్రాజెక్టులకు కరెంట్ కష్టాలు.. సాగు, తాగునీటికి ఎసరు.

డిస్కంల అప్పులపై ముఖ్యమంత్రివి పచ్చి అబద్ధాలు.. కాంగ్రెస్ హయాంలోనే ఏటా పదివేల కోట్ల బాకీలు.

విద్యుత్ సంస్థలను ప్రైవేటీకరించే కుట్రలో భాగంగానే మూడో డిస్కం ఏర్పాటు.. తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి.

గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డిస్కంలకు ప్రభుత్వం బకాయి పడింది రూ. 27,000 కోట్లు. అంటే ఏడాదికి సగటున సుమారు రూ. 2,000 కోట్లు మాత్రమే.

కానీ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో కేవలం ఈ కొద్ది కాలంలోనే డిస్కంలకు ప్రభుత్వం ఏకంగా రూ. 25,284 కోట్లు బకాయి పడింది.

అంటే కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాదికి సగటున రూ. 10,113 కోట్ల చొప్పున డిస్కంలను అప్పులపాలు చేసింది. ఇది బీఆర్ఎస్ తో పోలిస్తే ఐదు రెట్లు ఎక్కువ

పూటకో పార్టీ మారే రేవంత్ రెడ్డికి నా గురించి మాట్లాడే నైతికత లేదు.. నా ప్రయాణం, నా జీవితం కేసీఆర్ గారితోనే.

సిద్దిపేట క్యాంప్ కార్యాలయంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు గారు మీడియా సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకురానున్న ‘రైతు డిస్కం’ ఏర్పాటును ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీరుపై నిప్పులు చెరుగుతూ, రాష్ట్ర విద్యుత్ రంగ భవిష్యత్తుపై పలు కీలక అంశాలను ఆయన సాక్ష్యాలతో సహా మీడియా ముందు ఉంచారు.

హరీశ్ రావు గారి కామెంట్స్...

24 గంటల ఉచిత కరెంట్ కోసమే ఆర్పీడీసీఎల్ ఏర్పాటు చేస్తున్నామని నిన్న ముఖ్యమంత్రి చెప్పడం పచ్చి అబద్ధం.

ఆర్పీడీసీఎల్ తో రైతులకు ఉచిత విద్యుత్ రాకపోగా, అది వ్యవసాయ రంగానికి ఉరితాడుగా మారబోతోంది.

ఈఆర్సీ ముందు జరిగిన పబ్లిక్ హియరింగ్‌లో కాంగ్రెస్ పార్టీ అధికారికంగా రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ద్వారా రైతాంగానికి 3 గంటల కరెంట్ చాలు అని చెప్పించింది.

గతంలో రేవంత్ రెడ్డి కూడా అదే మాట అన్నారు. దమ్ముంటే, 24 గంటల ఉచిత విద్యుత్‌ను రైతులకు ఇస్తేనే నేను ఎన్నికల్లో ఓట్లు అడుగుతాను అని సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణం చేయాలని నేను ఛాలెంజ్ చేస్తున్నాను.

ప్రస్తుతం రాష్ట్రంలో ఎక్కడా 13 గంటలకు మించి కరెంట్ రావడం లేదు. గుజరాత్‌లో 7 గంటలు, కర్ణాటకలో 8 గంటల కరెంట్ మాత్రమే వస్తున్నట్లు, రేపు తెలంగాణలో కూడా 8, 9 గంటల కరెంట్ మాత్రమే ఇచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధమైంది.

నేనుఆధారాలతో మాట్లాడుతున్నాను. ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 8 లో స్పష్టంగా టీజీఆర్పీడీసీఎల్ కు హైయర్ షేర్ ఆఫ్ రిన్యూవబుల్ ఎనర్జీ ఇస్తామని చెప్పారు. రిన్యూవబుల్ ఎనర్జీ సోలార్ పవర్ ఉదయం 7 గంటలకు వచ్చి సాయంత్రం 5 గంటలకు ఆగిపోతుంది. థర్మల్, హైడల్ కరెంటును పక్కనపెట్టి, కేవలం పగలు మాత్రమే ఉండే సోలార్ కరెంటును వ్యవసాయానికి ఇస్తూ 24 గంటల కరెంట్ ఇస్తున్నామని చెప్పడం ప్రజలను వంచించడమే. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రంలో కాళేశ్వరం, దేవాదుల, నెట్టెంపాడు, కల్వకుర్తి, భీమా, కోయిల్ సాగర్, సీతమ్మ సాగర్ లాంటి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులన్నీ ప్రమాదంలో పడతాయి. నదిలో వరద వచ్చినప్పుడు మోటార్లు రౌండ్ ద క్లాక్ నడిపితే తప్ప ప్రాజెక్టులు నిండవు.

కేవలం పగలు మాత్రమే కరెంట్ ఇస్తే మోటార్లు ఆన్ అండ్ ఆఫ్ చేయాల్సి వచ్చి, అవి పాడైపోతాయని ఇరిగేషన్ ఇంజనీర్లు స్పష్టంగా చెబుతున్నారు.

దీనివల్ల రేపు రైతులకు సాగునీరు కూడా అందదు. అలాగే, రోజుకు 18 నుంచి 20 గంటలు నడిస్తే తప్ప మిషన్ భగీరథ లాంటి తాగునీటి ప్రాజెక్టుల ద్వారా ఇంటింటికీ నీళ్లు అందవు. వర్షాకాలం, చలికాలంలో ఎండ రాకపోతే మంచి నీళ్ల పథకాలు కూడా ఆగిపోయి ప్రజలు అల్లాడిపోతారు.

2003 ఎలక్ట్రిసిటీ యాక్ట్ ప్రకారం వినియోగదారులు కోరితే ఎవరికైనా కనెక్షన్ ఇవ్వాలి. కానీ ఆర్పీడీసీఎల్ వల్ల ఒకవేళ ఇరుకోడు పక్కన ఉన్న హనుమంతపల్లి లాంటి గ్రామాల్లో రైతులు బావి దగ్గర ఇల్లు కట్టుకున్నా, కోళ్ల ఫారం పెట్టుకున్నా, చెరుకు గానుగ ఆడించాలన్నా వారికి ఆర్పీడీసీఎల్ కరెంట్ ఇవ్వదు. మళ్లీ ఎస్పీడీసీఎల్ నుంచి కిలోమీటర్ల కొద్దీ పోల్స్ వేసుకుని, డబుల్ లైన్లు లాగితేనే కనెక్షన్ ఇస్తారు. దీనివల్ల ఒకే దగ్గర రెండు లైన్లు, రెండు స్తంభాలు వేయాల్సి వచ్చి రైతుల భూములు పాడవడంతో పాటు, ప్రజా ధనం వృథా అవుతుంది.

ఇదొక తుగ్లక్ చర్య. ముంబై, బెంగళూరులో లాగా లాభాలు వచ్చే డిస్కంలను ప్రైవేట్ సంస్థలకు కట్టబెట్టి, ఉచిత కరెంటును పక్కన పెట్టే కుట్రలో భాగంగానే రేవంత్ రెడ్డి ఈ మూడో డిస్కం ఏర్పాటు చేస్తున్నారు. దీనిపై తక్షణమే అసెంబ్లీ సమావేశాలు ఏర్పాటు చేసి చర్చించాలి.

నిన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ డిస్కంలు అప్పుల పాలైంది బీఆర్ఎస్ వల్లే అని మాట్లాడటం ఆయన అవగాహనా రాహిత్యానికి నిదర్శనం.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో డిస్కంలకు ప్రభుత్వం 27 వేల కోట్లు బకాయి పడితే, అంటే ఏడాదికి సుమారు 2 వేల కోట్లు అయితే.. ఈ కాంగ్రెస్ పాలనలో డిస్కాంలకు ప్రభుత్వం 25,284 కోట్లు బకాయి పడింది, అంటే ఏడాదికి 10 వేల కోట్లు అప్పుల పాలు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీవో ప్రకారమే డిస్కంల మొత్తం అప్పు రూ. 55,000 కోట్లుగా ఉంది.

విద్యుత్ వ్యవస్థ కోసం కాంగ్రెస్ చేసిందేమీ లేదు. గత పదేళ్లలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో 400ఎం సబ్ స్టేషన్లు 6 నుంచి 30కి, 220ఎం సబ్ స్టేషన్లు 51 నుంచి 103కి, 132ఎం సబ్ స్టేషన్లు 176 నుంచి 251కి, 33/11ఎం సబ్ స్టేషన్లు 2,138 నుంచి 3,210కి పెంచాం. 4 లక్షలు ఉన్న డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ఫార్మర్లను 8 లక్షల 60 వేలకు పెంచాం. 16 వేల కిలోమీటర్ల జులు లైన్లను 24 వేల కిలోమీటర్లకు విస్తరించాం.

గత కాంగ్రెస్ పాలనలో తండ్రి చనిపోతే స్నానం చేయడానికి కరెంట్ లేక నెత్తి మీద నీళ్లు చల్లుకొని వచ్చామని సాక్షాత్తూ రేవంత్ రెడ్డే అసెంబ్లీలో చెప్పారు.

ఆ చీకటి రోజులను పోగొట్టి విద్యుత్ వ్యవస్థను బలోపేతం చేసింది కేసీఆర్ గారు.

పూటకో పార్టీ మారే రేవంత్ రెడ్డికి నా గురించి మాట్లాడే నైతిక హక్కు లేదు. దేవుళ్ల మీద ఒట్టేసి రుణమాఫీ ఎగబెట్టిన రేవంత్ రెడ్డి తన ఇంటి పేరును అబద్ధాల రేవంత్ రెడ్డిగా మార్చుకోవాలి.

45 రోజుల్లో రైతు బంధు ఇస్తానని సిద్దిపేటకొచ్చి మాట తప్పింది నువ్వు కాదా?

నా జీవితమంతా కేసీఆర్ గారి వెంటే.. నా పుట్టుక, నా ప్రయాణం అంతా బీఆర్ఎస్ తోనే అని వందసార్లు చెప్పాను, మళ్లీ చెబుతున్నాను.

ఆర్పీడీసీఎల్ ఏర్పాటును వెంటనే రద్దు చేసి, రైతులకు 24 గంటల కరెంట్ ఇవ్వకపోతే బీఆర్ఎస్ పక్షాన పెద్ద ఎత్తున విద్యుత్ ఉద్యమాన్ని నిర్మిస్తాం.

# రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇచ్చిన 420 హామీలు అమలు చేస్తేనే ఎన్నికల్లో పోటీ చేస్తా అని ప్రకటించాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్

**ముఖ్యమంత్రి రైతుల మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయను అని చెప్పి మరోసారి అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాడని కేటీఆర్ ఆరోపణ**

**డబుల్ బెడ్రూమ్ ఇండ్లు, ఇందిరమ్మ ఇండ్లు కట్టకుంటే ఎన్నికల్లో పోటీ చేయం, మోటార్లకు మీటర్లు పెట్టకుంటే పోటీ చేయం అన్న సవాళ్లు కాకుండా, 420 హామీలు, ఆరు గ్యారెంటీలు అమలు చేయకుంటే పోటీ చేయమని ప్రకటించాలని కేటీఆర్ సవాల**

**రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతన్నలకి కేవలం 3 గంటల కరెంట్ ఇస్తే సరిపోతుంది అని చెప్పిండు**

**సరిగ్గా అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని ఆచరణలోకి తీసుకువచ్చేందుకే రైతు డిస్కం ఏర్పాటు**

**24 గంటల ఉచిత కరెంట్‌ను ఎగగొట్టేందుకే ఈ ప్రత్యేక రైతు డిస్కం**

**కేసీఆర్ గుర్తులు చెరిపేస్తా అన్న రేవంత్ రెడ్డి, చివరికి రైతన్నలకు ఇచ్చే 24 గంటల కరెంట్‌ను కూడా ఆపే కుట్ర చేస్తున్నారన్నారు**

**రేవంత్ రెడ్డి చెప్పింది చేయడని, ఇచ్చిన హామీ నెరవేర్చడనే విషయం తెలంగాణ ప్రజలకు అర్థమయింది**



రేవంత్ రెడ్డికి దమ్ముంటే ఇచ్చిన 420 హామీలు అమలు చేస్తేనే ఎన్నికల్లో పోటీ చేస్తా అని ప్రకటించాలని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. కేవలం రైతులకున్న ఉచిత కరెంట్‌ను పూర్తిగా రద్దు చేసేందుకే ప్రత్యేకంగా రైతు డిస్కం తీసుకొస్తున్నారని కేటీఆర్ అన్నారు. నిన్న ముఖ్యమంత్రి రైతుల మోటార్లకు మీటర్లు పెడితే ఎన్నికల్లో పోటీ చేయను అని చెప్పి మరోసారి అబద్ధాలు చెప్పే ప్రయత్నం చేస్తున్నాడని కేటీఆర్ ఆరోపించారు. ఇదే రేవంత్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రైతన్నలకి కేవలం 3 గంటల కరెంట్ ఇస్తే సరిపోతుంది అని చెప్పి, సరిగ్గా అధికారంలోకి వచ్చిన తర్వాత దాన్ని ఆచరణలోకి తీసుకువచ్చేందుకే, రైతన్నలకు ఉచిత కరెంట్‌ను విద్యుత్ సరఫరాను ఆపేందుకే రైతు డిస్కం ఏర్పాటు చేస్తున్నాడని ఆరోపించారు. కేవలం రైతన్నలకున్న 24 గంటల ఉచిత కరెంట్‌ను ఎగగొట్టేందుకే ఈ ప్రత్యేక రైతు డిస్కం అని కేటీఆర్ అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా కేసీఆర్ గారు ప్రారంభించిన ఉచిత విద్యుత్‌ను రైతన్నలకు అందకుండా చేసేందుకు కాంగ్రెస్ కుట్ర చేస్తుందన్నారు. కానీ లోపల ఇంతటి దారుణమైన రైతు వ్యతిరేక కుట్రను దాచుకొని, పైకి మాత్రం ఉచిత కరెంట్ కోసమే ప్రత్యేక రైతు డిస్కం తీసుకువస్తున్నామని రేవంత్ రెడ్డి అబద్ధాలు చెప్తున్నారన్నారు.

నేతి బీరకాయలో నెయ్యి ఎంత ఉందో, రేవంత్ రెడ్డికి రైతుల మీద అంతే ప్రేమ ఉందన్నారు. రేవంత్ రెడ్డి ‘రైతు డిస్కం’ అంటే రైతన్న మెడకు ఉరి పెట్టినట్టే అన్నారు. రైతు డిస్కం ద్వారా ఉచిత కరెంట్‌ను పూర్తిగా రద్దు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారన్నారు. తెలంగాణ రైతన్నలపై జరుగుతున్న ఈ కుట్రను నగరంలో ఉన్న తెలంగాణ పౌరులు కూడా వ్యతిరేకించి వారికి అండగా నిలవవలసిన అవసరం ఉందన్నారు.

రేవంత్ రెడ్డి చెప్పింది చేయడని, ఇచ్చిన హామీ నెరవేర్చడనే విషయం తెలంగాణ ప్రజలకు అర్థమయింది అని కేటీఆర్ అన్నారు. అందుకే ఈరోజు రైతు డిస్కం పైన రేవంత్ రెడ్డి చెప్తున్న మాటలు అన్నీ ముమ్మాటికి అబద్ధాలే అన్నారు. ఆయన ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు పరచకుండా, తెలంగాణలోని అన్ని వర్గాలను మోసం చేసిన విషయాన్ని ప్రజలు, రైతన్నలు గుర్తుంచుకోవాలన్నారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడే నాటికి 60 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో ఉన్న కరెంట్ కోతలని పూర్తిగా తీర్చేలా చేసింది కేసీఆర్ కాదా అని కేటీఆర్ ప్రశ్నించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడకముందు హైదరాబాద్ నగరంలో, తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడపడితే అక్కడ కరెంట్ కోతలు ఎంత తీవ్రంగా ఉండేవో గుర్తు చేసుకోవాలని కేటీఆర్ అన్నారు. కరెంట్ కోసం రైతన్నలతో పాటు చివరికి పారిశ్రామికవేత్తలు కూడా పరిశ్రమలకు హాలిడేలు ప్రకటించి, పరిశ్రమలు బంద్ పెట్టుకున్న పరిస్థితి మర్చిపోవద్దన్నారు. అంతటి దుస్థితి నుంచి కేసీఆర్ గారు ముఖ్యమంత్రి అయిన ఆరు నెలల్లోనే 65 సంవత్సరాల కాంగ్రెస్ పార్టీ చేయని పనిని కేసీఆర్ గారు చేసి, 24 గంటల కరెంట్ రాష్ట్రానికి అందించిన నాయకుడు ముమ్మాటికి కేసీఆర్ అన్నారు. 79 ఏళ్ల భారతదేశ స్వాతంత్ర భారతదేశ చరిత్రలో వ్యవసాయానికి ఉచితంగా 24 గంటల విద్యుత్ ఇచ్చిన నాయకుడు కేసీఆర్ అని అన్నారు. కానీ కేసీఆర్ గుర్తులు చెరిపేస్తా అన్న రేవంత్ రెడ్డి, చివరికి రైతన్నలకు ఇచ్చే 24 గంటల కరెంట్‌ను కూడా ఆపే కుట్ర చేస్తున్నారన్నారు.

ఈరోజు కేటీఆర్ కంటోన్మెంట్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ నగరానికి కాంగ్రెస్ పార్టీ రెండున్నర సంవత్సరాల్లో ఎలాంటి అభివృద్ధి చేయలేదని ఆరోపించారు. కంటోన్మెంట్ ఉప ఎన్నికల సందర్భంగా పొంగులేటి లాంటి మంత్రులు వచ్చి 6,000 ఇండ్లు కంటోన్మెంట్‌కు ఇస్తామని చెప్పిన మాటను గుర్తు చేస్తూ, రెండున్నర సంవత్సరాలు పూర్తయిన తర్వాత కనీసం ఒక్క ఇంటిని కూడా కంటోన్మెంట్‌కి, హైదరాబాద్ నగర ప్రజలకు ఇవ్వలేదన్నారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో, కేసీఆర్ గారి నాయకత్వంలో హైదరాబాద్ నగరానికి అద్భుతమైన ఫ్లై ఓవర్లను, అండర్ పాస్ లను, బ్రిడ్జిలను, 20,000 లీటర్ల ఉచిత తాగునీటిని, లక్ష డబుల్ బెడ్రూమ్ ఇండ్లను, జీవో 58, 59 ద్వారా పేద ప్రజలకు ప్రభుత్వ భూములను అందించిన ఘనత ముమ్మాటికి కేసీఆర్‌దే అన్నారు. కానీ కాంగ్రెస్ వచ్చిన తర్వాత పేదల ఇండ్లపై పడి ‘హైడ్రా’ భూతంతోని వేలాదిమంది ఇండ్లను కూలగొడుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. కంటోన్మెంట్‌లో ఉన్న రక్షణ శాఖ భూములు ఇస్తే, అటు కరీంనగర్ వైపు, నిజామాబాద్ వైపు స్కైవేల నిర్మాణం చేస్తామని పదులసార్లు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తులు చేసిన ఏనాడూ స్పందించలేదన్నారు. చివరికి అప్పటి ప్రభుత్వ ఒత్తిడి మొన్న ఫలించింది అని కేటీఆర్ అన్నారు. దీంతోపాటు కంటోన్మెంట్ నియోజకవర్గంలో ఆర్మీ అధికారులు అడ్డగోలుగా రోడ్లను ఎప్పటికప్పుడు బంద్ చేస్తే, కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ప్రజల సమస్యలు తీర్చామని గుర్తు చేశారు. హైదరాబాద్ నగరానికి అప్పటి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని గుర్తుంచుకొని అన్ని సీట్లలో బిఆర్ఎస్‌ని గెలిపించారని కేటీఆర్ గుర్తుచేశారు. కాంగ్రెస్ అనే దరిద్రాన్ని దేశం మొత్తం తిరస్కరిస్తే... తెలంగాణలో ఆ దరిద్రం తిరిగి వచ్చింది అన్నారు.

ఈరోజు జరిగిన సమావేశంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పైన పార్టీ కార్యకర్తలకు దిశానిర్దేశం కేటీఆర్ చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో బహుముఖ పోటీ ఉన్నప్పటికీ ఇప్పటికిప్పుడు ఎన్నికలు లేవు కాబట్టి అందరూ కలిసికట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటాలు చేసి, ప్రజలకు అండగా నిలవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు పలువురు సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

# జూన్ 2 ను అపాయింటెడ్ డే గా ప్రకటించాలి

## ఆర్టీసీ కార్మికుల డిమాండ్




**జహీరాబాద్ మే 31 ప్రజాబలం ప్రతినిధి:** రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు జహీరాబాద్ ఆర్టీసీ డిపోలో కార్మికులు 'డిమాండ్ డే' కార్యక్రమాన్ని నిర్వహించారు. జూన్ 2వ తేదీని 'అపాయింటెడ్ డే'గా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ కార్మికులు ఎర్ర బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి తమ డిమాండ్లను తెలియజేసేలా, జేఏసీ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు, ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ సహజమే

## -వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి




**జహీరాబాద్, మే 31 ప్రజాబలం ప్రతినిధి:** ప్రభుత్వ ఉద్యోగులకు పదవీ విరమణ సహజమని, వారు చేసిన సేవలు ఎప్పటికీ గుర్తు ఉంటాయని జహీరాబాద్ మునిసిపల్ వైస్ చైర్మన్ శిరీష సురేందర్ రెడ్డి అన్నారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన మున్సిపల్ కమిషనర్ జైతురామ్ నాయక్ ఉద్యోగ పదవి విరమణ సన్మాన కార్యక్రమంలో కౌన్సిలర్లు అధికారులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కమిషనర్ జైతురామ్ నాయక్ అందరితో కలుపుగోలుగా ఉంటూ జహీరాబాద్ మునిసిపల్ అభివృద్ధికి తన వంతు కృషి చేశారని గుర్తు చేశారు. వారు చేసిన సేవలు జహీరాబాద్ ప్రజలకు నిరంతరంగా గుర్తుంటాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ డి ఈ దీపచంద్, కౌన్సిలర్లు శ్రీధర్ రెడ్డి, జహంగీర్, అరుణ్, నిజాం, జమీలుద్దీన్, సోనమ్మ ఎర్మీయా, మునిసిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# ప్రెస్ క్లబ్ లో ముగిసిన వేసవి శిక్షణ శిబిరం....




**ప్రెస్ క్లబ్ ప్రజాబలం ప్రతినిధి:** ప్రెస్ క్లబ్ హైదరాబాద్– తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్) ఆధ్వర్యంలో ప్రెస్ క్లబ్ హైదరాబాద్ సోమాజిగూడ లో జరుగుతున్నటువంటి ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ఆదివారంతో ముగిసాయి. శాట్ – తెలంగాణ చెస్ సంఘం సహకారంతో ఏప్రిల్ 6 నుంచి మొదలైన ఈ శిబిరంలో చిన్నారులకు చెస్, యోగా, జుంబ డాన్స్ లో శిక్షణ అందించారు. తెలంగాణ చెస్ సంఘం అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ చెస్ లో శిక్షణ అందించారు. భవాని ఆధ్వర్యంలో యోగా, కీర్తి ఆధ్వర్యంలో జుంబా డ్యాన్సులో శిక్షణ ఇచ్చారు. ప్రెస్ క్లబ్ కమిటీ మెంబర్స్, ఆఫీస్ బేరర్స్ చొరవతో ఈ శిబిరం విజయవంతంగా జరిగింది. ఈ శిబిరాల్లో పలువురు ప్రెస్ క్లబ్ సభ్యులతో పాటు వారి పిల్లలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## మ్యాన్ పవర్ కాంట్రాక్ట్ తో కార్మికులకు ఉపాధి కల్పించండి

### = మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన ఐఎఫ్టియు నేత వెంకన్న



**పెద్దపల్లి, మే 31, ప్రజాబలం ప్రతినిధి :** ఆర్ జి త్రీ ఓసిపి టు సి గ్రూప్ మ్యాన్ పవర్ కాంట్రాక్ట్ కార్మికుల టెండర్ ను పిలిచి కార్మికులకు ఉపాధిని కల్పించే విధంగా సింగరేణి యాజమాన్యాన్ని ఒప్పించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్టియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ వెంకన్న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు ను కోరారు. ఈ సందర్భంగా ఆదివారం మంత్రిని కలసి వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులు ఓసిపి టు ప్రభావిత గ్రామాల నిరుపేద దళిత వర్గాల సంబంధించిన కార్మికులు ఉన్నారన్నారు. వీరందరికీ టెండర్ తెప్పించి కార్మికులను ఆర్థికంగా ఆదుకోవాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఓదేలు, శ్రీనివాస్, రాజయ్య, సదానందం, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎంతోమంది

## యువకుల బలిదానాలు జరిగాయి.

ఎంతోమంది శ్రమపడి సాధించుకున్న తెలంగాణలో ఉద్యమ స్ఫూర్తితో పనిచేసి సర్వం కోల్పోయినటువంటి ఉద్యమకారులను తెలంగాణ ప్రభుత్వాలు ఏర్పడిన తర్వాత పట్టించుకోవడం లేదు.

తెలంగాణ రాష్ట్రంలో మన ప్రభుత్వం నడుస్తుంది మన తెలంగాణ సాధన కొరకు కష్టపడి పని చేసినటువంటి అనేకమంది ఉద్యమకారులకు హెల్త్ కార్డులు, ఇంటి స్థలాలు,

వృద్ధాప్యంలో ఉన్న కొంతమందికి పింఛన్ విధానాలు, ఇండ్ల నిర్మాణం ఇంకా ముఖ్యంగా తెలంగాణ ఉద్యమకారుల కొరకు ప్రతి జిల్లాలో ప్రభుత్వ స్థలాలు కేటాయించి వారికి తెలంగాణ ఉద్యమకారుల కాలనీల పేరుతో అందరికీ ప్రభుత్వం ఇండ్లు కట్టించి ఇవ్వాలి. ఇప్పటికైనా గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ఉద్యమకారుల ఆశల పైన నీళ్లు చల్లకుండా ఉద్యమకారులను గుర్తించండి. వారి కష్టాలను గుర్తించండి. వారు కోరుకున్న విధంగా వారి హక్కుల కొరకు వారు చేస్తున్న పోరాటాలను పరిగణలోకి తీసుకొని ఉద్యమకారుల హక్కుల పరిరక్షణకు వారి యొక్క అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ప్రతి జిల్లాకు ఒక 100 కోట్ల రూపాయలు చొప్పున నిధులు విడుదల చేసి ఉద్యమకారుల కాలనీలు ఏర్పాటు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ కరీంనగర్ జిల్లా పక్షణా రాష్ట్ర ప్రభుత్వానికి తెలియజేస్తున్నాను.

దుర్గం మారుతి నేతకాని,

న్యాయవాది,

తెలంగాణ ఉద్యమకారుల ఌఖజీూజ కరీంనగర్ జిల్లా ప్రధాన కార్యదర్శి.

జై తెలంగాణ జై జైఎ తెలంగాణ

టి యు జెఎసి ఉద్యమకారుల ఐక్యత వర్ధిల్లాలి.

# కట్టే పాడ్ తాండప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో

## పాల్గొన్న సర్పంచ్ పరుశురాం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి మే 31(ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి మండలం పట్లూర్ అనుబంధ గ్రామం కట్టే పాడుతాండ లో 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా ఎర్లీ చైల్డ్ హుడ్ ఎడ్యుకేషన్అంగన్వాడి సెంటర్ ను 99 ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగాసందర్శించిన పట్లూర్ గ్రామ సర్పంచ్ పరుశురాం, ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వానా,



కట్టే పాడు తండా లో అంగన్వాడి సెంటర్లో విద్యార్థులకు నూతన వస్త్రాలు పంపిణీ చేయడం జరిగిందని సర్పంచ్ పరుశురాం తెలిపారు అదే విధంగా అంగన్వాడి సెంటర్ అంటేనే చిన్నపిల్లలకు అమ్మబడి లాంటిది పిల్లలను అంగన్వాడి టీచర్ ఆయమ్మ పిల్లలను లాలిస్తూ బుజ్జగిస్తూ పాటలు పాడిస్తూ నవ్విస్తూ పిల్లలకు తినిపిస్తూ పిల్లలకు విద్యార్థి దశ చదువుకునే మార్గము అంగన్వాడి సెంటర్ నుండే విద్యార్థులకు ప్రారంభమవుతుందని సర్పంచ్ పరశురాం తెలిపారు 99 రోజుల ప్రగతి ప్రణాళికలో భాగంగా పట్లూర్ గ్రామ సర్పంచ్ పరు శురాం, ఐసిడిఎస్ సూపర్వైజర్ రిజ్వానా, గ్రామ సెక్రెటరీ గోపాల్, అంగన్వాడి టీచర్ లక్ష్మి, మాజీ ఎంపిటిసి మహేష్, కాశీనాథ్, అంగన్వాడి విద్యార్థుల తల్లిదండ్రులు పుష్పలత,

# బహుజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలి

## -భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షులు సిద్దూ రావణ్





**జహీరాబాద్, మే 31 ప్రజాబలం ప్రతినిధి:** బహుజనులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాల్సిన అవసరం ఎంతైనా ఉందని శాంతి ఫౌండేషన్ చైర్మన్, భీమ్ ఆర్మీ రాష్ట్ర అధ్యక్షులు సిద్దు రావణ్ పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలో ఆదివారం బహుజనుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విధానాలతో, కాన్సిరాం ఆలోచన ప్రకారం ముందుకు వెళ్లాలన్నారు. బహుజనులందరూ ఏకతాటిపై నడిచి రానున్న రోజుల్లో రాజ్యాధికారాన్ని సాధించుకోవాలన్నారు. జహీరాబాద్ ప్రాంతం పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో స్థానికత అంశాన్ని లేవనెత్తి యువకులు ఉద్యోగాలు సాధించేందుకు ఉద్యమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో నరసింహ, బాలరాజ్, శంకర్, దీపక్, ఆకాష్ విష్ణు, రాజీవ్, నర్సింగ్ రావు, రాములు, మొగులయ్య, న్యాయవాది ఇస్మాలప్ప, ధనరాజ్, సుభాష్ అనంతయ్య, అశోక్, రఘువీర్, తదితరులు పాల్గొన్నారు

## తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా తోపాజి అనంత కిషన్ గుప్తా



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:** సంగారెడ్డి/తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడిగా తోపాజి అనంత కిషన్ గుప్తా రెండవసారి ఎన్నికైయ్యారు,తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడు అమరవాది లక్ష్మీనారాయణ చేతుల మీదుగా నియామక పత్రాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనకు పలువురు ఆర్యవైశ్య సంఘ నాయకులు,సభ్యులు హర్షం వ్యక్తం చేస్తూ శు భాకాంక్షలు తెలిపారు,అనంతరం తోపాజి అనంత కిషన్ గుప్తా మాట్లాడుతూ సమాజ అభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు.

# వి ఆర్ 4 సహయోగ్ ట్రస్ట్ ద్వారా సత్యనారాయణ స్వామి వ్రతము






**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 31 మే 2026**వి ఆర్ 4 సహయోగ్ చారిటేబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత పూజా సామగ్రి సమకూరుస్తూ యదా విధిగా పౌర్ణిమ 31 ఆదివారం రోజున సామూహిక శ్రీ వీర వెంకట సత్యనారాయణ స్వామి వ్రతము పుప్పాలగూడ మహావీర్ హనుమాన్ మందిర్లో వినూత్న రీతిలో గణపతి, గౌరమ్మ, నవగ్రహ, అష్ట దిక్పాలక పూజలు వారి ఇష్ట ధాన్యంల పూజలతో పాటు సత్యనారాయణ వ్రతము పురోహితుడు మండువ మధుసుధన శర్మచే జరుపబడెనని మేనేజింగ్ ట్రస్టీ అందే లక్ష్మణ్ రావు తెలియ పరిచారు. ఇట్టి సంప్రదాయ పద్ధతిలో జరిగిన సామూహిక సత్యనారాయణ వ్రతములో వంద జంటలు కుటుంబ సమేతముగా పాల్గొన్నారని, ప్రతి పౌర్ణిమకు పుప్పాలగూడ పంచకమిటీ లోధ క్షత్రియ సదర్ పంచాయతీ వారు దేవాలయ ఆవరణలో అన్న ప్రసాద వితరణ గావంచడం ఆనవాయితీ కాగా పూజానంతరము అట్టి కార్యక్రమంలో స్థానిక భక్తులు పాల్గొన్నారని పంచకమిటీ లోధ క్షత్రియ సదర్ పంచాయతీ కమిటీ సభ్యులు మరియు రాజన్ భాయి తదితరులు తెలిపారు.

## ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి కాంగ్రెస్ కార్యకర్త బాధ్యత ---
## ఆదిలాబాద్ బీఎల్ఏ-2 సమావేశంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ



ఆదిలాబాద్, మే 31: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ బీఎల్ఏ-2 సమావేశానికి పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ హాజరయ్యారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా జిల్లా కేంద్రానికి చేరుకున్న ఎంపీకి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పార్టీ శ్రేణులతో కలిసి సమావేశంలో పాల్గొని సంస్థాగత బలోపేతం, ఓటరు జాబితాల పరిశీలన, బూత్ స్థాయి కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు.



ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ దేశంలో ఎన్నికల వ్యవస్థను ప్రభావితం చేసేలా బీజేపీ కుట్రలు చేస్తోందని విమర్శించారు. ఎస్ఐఆర్ పేరుతో ఎన్నికల కమిషన్‌ను ముందుంచి కాంగ్రెస్ పార్టీతో పాటు ప్రాంతీయ పార్టీలకు బలంగా ఉన్న నియోజకవర్గాల్లో ఓట్ల తొలగింపునకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఏ బూత్‌లో ఏ పార్టీకి ఎక్కువ మద్దతు ఉందో ప్రత్యేకంగా గుర్తించి అక్కడ ఓటర్లను లక్ష్యంగా చేసుకోవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని అన్నారు.రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా "ఓటు చోరీ" అంశాన్ని ముందుకు తీసుకొచ్చారని, ఇప్పుడు దేశ ప్రజలందరూ అదే విషయాన్ని కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును దూరం చేసే ప్రయత్నాలను ప్రజాస్వామ్య శక్తులు కలిసి తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. ప్రతి బీఎల్ఏ అంబేద్కర్ స్ఫూర్తితో పనిచేస్తూ ప్రతి బూత్‌లో ఓటు హక్కును పరిరక్షించే బాధ్యత తీసుకోవాలని సూచించారు.దేశంలో నీట్ పరీక్షల నిర్వహణపై కూడా ఎంపీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వరుసగా జరుగుతున్న పేపర్ లీకేజీలతో విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు. విద్య, ఉపాధి అవకాశాల విషయంలో యువతకు భరోసా కల్పించే దిశగా కేంద్రం పనిచేయాలని కోరారు. తెలంగాణ రాజకీయాలపై స్పందిస్తూ బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. యువతను రెచ్చగొట్టి కేసుల్లో ఇరికించే రాజకీయాలు మంచివి కావని, యువత చదువు, ఉపాధి, భవిష్యత్తుపై దృష్టి పెట్టేలా రాజకీయాలు ఉండాలని పేర్కొన్నారు.బీఎల్ఏ-2 సమావేశంలో ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఏర్పాటు, ప్రజా సమస్యలపై స్పందన, రాబోయే రాజకీయ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎస్వీ బేకరీ ప్రారంభించిన ఎమ్మెల్యే చింత ప్రభాకర్



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ బైపాస్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్వీ బేకరీని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా బేకరీ నిర్వాహకులు ఎమ్మెల్యేకు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు,అనంతరం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ, వ్యాపార సంస్థ అభివృద్ధి చెందాలని ఆకాంక్షిస్తూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, మాజీ టీఎన్జీవోస్ రాష్ట్ర అధ్యక్షుడు మామిళ్ల రాజేందర్, చీల మలన్న, రఘు, సర్పంచ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సంగారెడ్డిలో ఇందిరమ్మ చీరలు పంపిణీ...
## కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతి:టీజిఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి మే 31(ప్రజాబలం)సంగారెడ్డి జిల్లా:**సంగారెడ్డి/ పట్టణంలోని 22 వ వార్డ్ రామ్ నగర్ లో గ్రామైక్య మహిళా సంఘ సభ్యులకు నిర్మలా జగ్గారెడ్డి ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు.,రామ్ నగర్, రామ్ మంధిర్ లోని ఆమె స్వగృహం లో , స్థానిక కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ ఆధ్వర్యం లో ఈ చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది,ఈ సందర్భంగా నిర్మలా జగ్గారెడ్డి మాట్లాడుతూ ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా పక్షపాతిగా ఉందని, ఏ ప్రభుత్వ కార్యక్రమం మొదలుపెట్టినా మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళలకు నాణ్యమైన చీరలను పంపిణీ చేస్తుందని, గత ప్రభుత్వం లో పంపిణీ చేసిన చీరలను పొలాల వద్ద బెదురు కోసం వాడిన విషయాన్ని గుర్తు చేశారు,ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కూన వనితా సంతోష్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అశోక్ రెడ్డి, వార్డు పెద్దలు కల్పన తదితరులు పాల్గొన్నారు.

## టిఆర్ఎస్ పార్టీ వైపు సంగారెడ్డి జిల్లా యువత భారీగాఆకర్షితులవుతోంది



**అందోల్ నియోజకవర్గం ప్రతినిధి మే 31 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త ప్రత్యామ్నాయంగా అవతరించిన" తెలంగాణ రక్షణ సేన " (టిఆర్ఎస్) పార్టీ వైపు సంగారెడ్డి జిల్లా యువత భారీగా ఆకర్షితలవుతోంది పార్టీ ఆవిర్భావ సమయం నుంచి ప్రజల్లోకి బలంగా వెళ్తున్న సిద్ధాంతాలు, ముఖ్యంగా ఐదు ప్రధాన ఎజెండాలతో కూడిన "పాంచజన్యం"నినాదం నియోజకవర్గంలోని యువతీ యువకులను విశేషంగా ప్రభావితం చేస్తోంది.సంగారెడ్డి నియోజకవర్గ ఇంచార్జ్ కలబ్ గుర్ దయాకర్ రెడ్డి నేతృత్వంలో ఇప్పటికే నియోజకవర్గవ్యాప్తంగా వందల సంఖ్యలో యువకులు, స్థానిక నాయకులు పార్టీలో చేరుతుండటంతో క్షేత్రస్థాయిలో టీఆర్ఎస్ (రక్షణ సేన) శ్రేణుల్లో ఉత్సాహం నెలకొంది.యువతను కదిలిస్తున్న 'పాంచజన్యం' ఎజెండాసమాజంలో సమూల మార్పులే ధ్యేయంగా పార్టీ అధినేత్రి కల్వకుంట్ల కవిత ప్రకటించిన 'పాంచజన్యం' ప్రణాళికే తమ పార్టీకి శ్రీరామరక్ష అని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. తెలంగాణ రక్షణ సేన పార్టీ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత వచ్చే నెల జూన్ 7 వ తేదీన సంగారెడ్డి జిల్లా కేంద్రంలోపర్యటించనున్నారు. ఈ పర్యటనలో భాగంగా జిల్లా కేంద్రంలోని 'తెలంగాణ తల్లి' విగ్రహానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారు. పార్టీ అధికారికంగా ఏర్పాటైన తర్వాత జిల్లాలో జరిగే మొదటి కీలక కార్యక్రమం కావడంతో స్థానిక నాయకత్వం దీనిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంది.

## రామాలయంలో శాస్త్రోక్తంగా శ్రీ సత్యనారాయణ స్వామి సామూహిక వ్రతాలు...



నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని రాంనగర్ కాలనీలో గల శ్రీ సీతారామచంద్ర స్వామి దేవాలయంలో అధిక జ్యేష్ట మాసం శుద్ధ పౌర్ణమి సందర్భంగా ఆదివారం నాడు 8 మంది దంపతులచే నిర్వహించిన సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాలు శాస్త్రోక్తంగా వేద మంత్ర చరణల మధ్య నిర్వహించినట్లు రామాలయ ప్రధాన అర్చకులు కందాడై వరదరాజన్ అయ్యంగార్ తెలిపారు.ఆయన మాట్లాడుతూ సూక్ష్మంలో మొక్షమార్గం పొందుటకు ప్రతి హిందూ కుటుంబం శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతాన్ని తప్పనిసరిగా ఆచరించాలని సూచించారు. స్వామివారి కృపా కటాక్షాలు పొందుటకు ఉన్నంతలో స్వామివారి వ్రతాలు చేయాలని సూచించారు.వ్రతంలో పాల్గొన్న ప్రతిభక్తుని గోత్రనామాలు తో సంకల్పం చెప్పినట్లు తెలిపారు.అనంతరం వేద ఆశీర్వచనం, తీర్థ ప్రసాదాల పంపిణీ చేశారు.పాల్గొన్న భక్తులందరికీ రామాలయం అన్నప్రసాద కమిటీ వారిచే సామూహిక అన్న ప్రసాదాన్ని భక్తులందరికీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు అర్థం రవీందర్,టి.మల్లేష్,ఓ. శ్రీను,టి.యాదగిరి, నందకిశోర్,గొల్ల రాములు,ప్రదీప్,శిరీష, రమాదేవి యాదమ్మ, భాగ్యమ్మ,భక్తులు మహిళలు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# మరి కొన్నిరోజుల్లో ఫిఫా వరల్డ్ కప్... భారత్‌లో ప్రసారాలపై ఇంకా వీడని అనిశ్చితి

**మరికొన్ని రోజుల్లో ఫిఫా వరల్డ్ కప్, ప్రసారాలపై వీడని ఉత్కంఠ**

**ప్రసార హక్కుల రేసులో జీ నెట్‌వర్క్ ముందంజ**

**భారీ ధర, అనుకూలించని మ్యాచ్ సమయాలతో చర్చల్లో జాప్యం**

**ఒప్పందం కుదిరితే జీ స్పోర్ట్స్, జీ5లో అన్ని మ్యాచ్‌ల ప్రసారం**

**జియోస్టార్ ఆఫర్‌ను తిరస్కరించిన ఫిఫా**

ఫిఫా ఫుట్‌బాల్ ప్రపంచకప్ 2026 ప్రారంభానికి కొద్ది రోజులే ఉన్నా, భారత్‌లో ప్రసారాలపై ఇంకా సందిగ్ధత వీడలేదు. జూన్ 11న మెగా టోర్నీ మొదలుకానుండగా, ఏ ఛానెల్‌లో మ్యాచ్‌లు వస్తాయో తెలియక కోట్లాది మంది అభిమానులు ఆందోళన చెందుతున్నారు. అయితే, చివరి నిమిషంలో ఈ ఉత్కంఠకు తెరపడనున్నట్లు తెలుస్తోంది. ప్రముఖ బ్రాడ్‌కాస్టింగ్ సంస్థ 'జీ' నెట్‌వర్క్ ప్రసార హక్కులను దక్కించుకునేందుకు గట్టిగా అడుగులు వేస్తున్నట్టు సమాచారం.

దాదాపు 30–35 మిలియన్ డాలర్ల (సుమారు రూ. 250–290 కోట్లు) ఒప్పందంతో జీ నెట్‌వర్క్ ఈ హక్కులను సొంతం చేసుకునే అవకాశాలున్నాయి. ఒప్పందం ఖరారైతే, టోర్నీలోని మొత్తం 104 మ్యాచ్‌లను జీ స్పోర్ట్స్ ఛానెళ్లలో, అలాగే జీ5 ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో బహుళ భాషల కామెంటరీతో ప్రసారం చేయనున్నారు. అతి త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెలువడవచ్చని భావిస్తున్నారు.



ఈసారి ప్రసార హక్కుల విషయంలో జాప్యం జరగడానికి ప్రధాన కారణం ఫిఫా మొదట అధిక ధర డిమాండ్ చేయడమే. 2026, 2030 సీజన్లకు కలిపి దాదాపు 100 మిలియన్ డాలర్లు ఆశించడంతో బ్రాడ్‌కాస్టర్లు వెనకడుగు వేశారు. దీనికి తోడు, భారత్‌లోని వీక్షకులకు మ్యాచ్ సమయాలు అనుకూలంగా లేకపోవడం మరో ప్రతికూలాంశంగా మారింది. చాలా మ్యాచ్‌లు అర్ధరాత్రి, తెల్లవారుజామున జరగనున్నాయి. మొత్తం 104 మ్యాచ్‌లలో కేవలం 14 మాత్రమే భారత కాలమానం ప్రకారం అర్ధరాత్రిలోపు ప్రారంభం కానున్నాయి. ఫైనల్ మ్యాచ్ సైతం అర్ధరాత్రి దాటాక 12:30 గంటలకు జరగనుంది. ఈ కారణాలతో జియోస్టార్ కేవలం 20 మిలియన్ డాలర్ల ప్రతిపాదనన ఫిఫా ముందుంచింది. అయితే ఈ ఆఫర్‌ను ఫిఫా తిరస్కరించింది.

భారత జట్టు ప్రపంచకప్‌కు అర్హత సాధించకపోయినా, ఇక్కడ ఫుట్‌బాల్‌కు విపరీతమైన ఆదరణ ఉంది. 2022లో ఖతార్‌లో జరిగిన ప్రపంచకప్‌ను భారత్‌లో 110 మిలియన్ల మంది డిజిటల్ మాధ్యమాల్లో వీక్షించారు. ఇది ఫిఫా ప్రపంచ వీక్షకుల్లో 2.9 శాతం కావడం విశేషం. ఏదేమైనా, ఆలస్యమైనప్పటికీ అభిమానులకు ప్రపంచకప్ మ్యాచ్‌లను చూసే అవకాశం లభించడం ఖాయంగానే కనిపిస్తోంది.

# మైదానంలో చిచ్చరపిడుగు.. గదిలో మాత్రం చిన్న పిల్లాడే.. వైభవ్ సూర్యవంశీ స్పెషల్ స్టోరీ!


**ఐపీఎల్ 2026లో సత్తా చాటుతున్న 15 ఏళ్ల వైభవ్ సూర్యవంశీ**

**600కు పైగా పరుగులతో ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా నిలిచిన యంగ్ ప్లేయర్**

**ఎంత ఒత్తిడి ఉన్నా మానసిక ప్రశాంతత కోసం కార్టూన్లు చూస్తానని వెల్లడి**

**గత సీజన్‌లోనే తొలి మ్యాచ్ తొలి బంతికే సిక్స్.. మూడో మ్యాచ్‌లోనే సెంచరీతో రికార్డ్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో ఒక పేరు మార్మోగిపోతోంది. అతనే రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం వైభవ్ సూర్యవంశీ. కేవలం 15 ఏళ్ల వయసులోనే అసాధారణ బ్యాటింగ్‌తో క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తున్నాడు. ఈ సీజన్‌లో ఇప్పటికే 600కు పైగా పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ హోల్డర్‌గా కొనసాగుతున్నాడు. బుమ్రా, కమిన్స్, హేజిల్‌వుడ్ వంటి ప్రపంచ స్థాయి బౌలర్ల బౌలింగ్‌ను చీల్చి చెండాడుతూ 'ఫియర్‌లెస్ ప్రాడిజీ' అనే పేరు తెచ్చుకున్నాడు. మైదానంలో ఇంతటి పరిణతి చూపిస్తున్నా, గదిలోకి వెళితే మాత్రం అతను ఇప్పటికీ కార్టూన్లు చూసే ఓ చిన్న పిల్లాడే.




తన ఈ అలవాటు గురించి వైభవ్ స్వయంగా వెల్లడించాడు. జియోస్టార్‌తో మాట్లాడుతూ.. "రెండేళ్ల క్రితం ఇంట్లో ఉన్నప్పుడు మ్యాచ్‌లు ఆడినా, ప్రాక్టీస్ చేసినా ఖాళీ సమయం దొరికితే కార్టూన్లు చూసేవాడిని. అది నాకు చాలా ఆనందాన్నిచ్చేది. ఇప్పటికీ నాకు మానసిక ప్రశాంతత కావాలనిపించినా, కాస్త రిలాక్స్ అవ్వాలనుకున్నా కార్టూన్లు చూస్తాను. గదిలో సౌకర్యంగా కూర్చుని నాకు నచ్చిన కార్టూన్లు చూస్తుంటే చాలా హాయిగా అనిపిస్తుంది. అచ్చం ఇంట్లో ఉన్న భావన కలుగుతుంది" అని తన మనసులోని మాటను పంచుకున్నాడు.

ఐపీఎల్ 2025 వేలానికి ముందు రాజస్థాన్ రాయల్స్ ఈ యువ ప్రతిభను గుర్తించింది. రూ. 1.10 కోట్లకు అతడిని సొంతం చేసుకుంది. ఆ క్షణాలను గుర్తుచేసుకుంటూ.. "వేలం దుబాయ్‌లో జరుగుతున్నప్పుడు నేను కూడా అక్కడే ఉన్నాను. ట్రయల్స్ తర్వాత టీమ్ మేనేజర్ రోమి భిందర్ సర్ నాకు ఫోన్ చేసి, నన్ను కొనుగోలు చేయబోతున్నట్లు చెప్పారు. వేలంలో కొన్నాక ఫోన్ చేసి అభినందనలు తెలిపారు" అని చెప్పాడు.

గత సీజన్‌లో అరంగేట్రం చేసిన వైభవ్, ఎదుర్కొన్న తొలి బంతినే సిక్సర్‌గా మలిచి తన రాకను ఘనంగా చాటాడు. ఆడిన మూడో మ్యాచ్‌లోనే సెంచరీ చేసి తన కుటుంబానికి, తనకు గర్వకారణంగా నిలిచాడు. ఇప్పుడు అదే ఊపును కొనసాగిస్తున్నాడు. ఇటీవలే సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో జరిగిన ఎలిమినేటర్ మ్యాచ్‌లో కేవలం 29 బంతుల్లోనే 97 పరుగులు చేసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఇప్పుడు క్వాలిఫయర్–2లో గుజరాత్ టైటాన్స్‌తో తలపడేందుకు సిద్ధమవుతున్న వైభవ్, తన అద్భుత ఫామ్‌ను కొనసాగించాలని పట్టుదలగా ఉన్నాడు.

# ఐపీఎల్ 2026 ఫైనల్‌పై అశ్విన్ జోస్యం.. ఈసారి టైటిల్ ఆ జట్టుదేనట!

**ఐపీఎల్ 2026 ఫైనల్‌లో ఆర్సీబీనే హాట్ ఫేవరెట్ అని అశ్విన్ జోస్యం**

**ఈ ఫైనల్ లో గెలుపోటములు పూర్తిగా ఆర్సీబీ చేతుల్లోనే ఉన్నాయని వ్యాఖ్య**

**క్వాలిఫయర్-1లో గుజరాత్‌ను ఆర్సీబీ 92 పరుగుల తేడాతో చిత్తు చేసిన వైనం**

**అహ్మదాబాద్‌లో ఆడటం గుజరాత్‌కు కలిసొచ్చే కీలక అంశం**

**వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని చూస్తున్న ఆర్సీబీ**

ఐపీఎల్ 2026 సీజన్ ఫైనల్ సమరానికి రంగం సిద్ధమైంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో జరగనున్న ఈ తుది పోరులో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ), గుజరాత్ టైటాన్స్ (జీటీ) తలపడనున్నాయి. అయితే, ఈ కీలక మ్యాచ్‌లో ఆర్సీబీ జట్టే హాట్ ఫేవరెట్ అని, కప్పు గెలవడానికి వారికే ఎక్కువ అవకాశాలు ఉన్నాయని భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

"ఆర్సీబీ టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేస్తుందా లేదా బౌలింగ్ చేస్తుందా అనేదానితో సంబంధం లేదు. ఈ ఫైనల్ మ్యాచ్‌లో గెలుపోటములు పూర్తిగా వారి చేతుల్లోనే ఉన్నాయి. వారు హాట్ ఫేవరెట్స్‌గా బరిలోకి దిగుతున్నారు. వారు ఏ నిర్ణయం తీసుకున్నా సరే... ఈ సీజన్ పొడవునా వారు ప్రదర్శించిన దూకుడును ఏమాత్రం తగ్గించకూడదు, వెనకడుగు వేయనేకూడదు" అని స్పష్టం చేశాడు.




ధర్మశాలలో మే 26న జరిగిన క్వాలిఫయర్–1 మ్యాచ్‌లో ఆర్సీబీ 92 పరుగుల భారీ తేడాతో గుజరాత్‌ను చిత్తుగా ఓడించిన విషయం తెలిసిందే. ఆ మ్యాచ్‌లో కెప్టెన్ రజత్ పటీదార్ (33 బంతుల్లో 93 నాటౌట్) విధ్వంసకర ఇన్నింగ్స్‌తో ఆర్సీబీ 254/5 పరుగుల భారీ స్కోరు చేయగా, గుజరాత్ 162 పరుగులకే కుప్పకూలింది. అయితే, మే 29న జరిగిన క్వాలిఫయర్–2లో రాజస్థాన్ రాయల్స్‌పై 7 వికెట్ల తేడాతో గెలిచి గుజరాత్ ఫైనల్‌కు అర్హత సాధించింది.

అశ్విన్ మాట్లాడుతూ.. "ఆర్సీబీ బ్యాటింగ్ చేసినా, బౌలింగ్ చేసినా ఫర్వాలేదు. వారు తమ దూకుడైన ఆటతీరును కొనసాగించాలి తప్ప, వెనక్కి తగ్గకూడదు" అని సూచించాడు. అయితే, గుజరాత్‌కు సొంతగడ్డపై ఆడటం అతిపెద్ద అడ్వాంటేజ్ అని పేర్కొన్నాడు. "నరేంద్ర మోదీ స్టేడియం పిచ్‌పై గుజరాత్‌కు మంచి పట్టుంది. ఇది వారికి అదనపు బలాన్నిస్తుంది" అని విశ్లేషించాడు.

గత ఏడాది ఛాంపియన్‌గా నిలిచిన ఆర్సీబీ, ఈ సీజన్‌లోనూ అద్భుత ఫామ్‌తో లీగ్ టేబుల్‌లో అగ్రస్థానంలో నిలిచింది. ఈసారి కూడా టైటిల్ గెలిచి చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ తర్వాత వరుసగా రెండుసార్లు కప్పు గెలిచిన మూడో జట్టుగా చరిత్ర సృష్టించాలని పట్టుదలగా ఉంది. మరోవైపు 2022 విజేత అయిన గుజరాత్ టైటాన్స్ కూడా ఈ సీజన్‌లో నిలకడైన ప్రదర్శన కనబరిచింది. శుభ్‌మన్ గిల్ నాయకత్వంలో సొంత ప్రేక్షకుల మధ్య ఫైనల్ ఆడనుండటం వారికి కలిసొచ్చే అంశం. ఒకవైపు విరాట్ కోహ్లీ వంటి స్టార్లతో నిండిన ఆర్సీబీ బ్యాటింగ్ లైనప్, మరోవైపు రషీద్ ఖాన్, రబాడ వంటి బౌలర్లతో పటిష్ఠంగా ఉన్న గుజరాత్ బౌలింగ్ విభాగం మధ్య ఈ పోరు హోరాహోరీగా సాగే అవకాశం ఉంది.

# ఫైనల్ కూడా మామూలు గేమే.. గతేడాది జ్ఞాపకాలే మా బలం: ఆర్సీబీ కెప్టెన్

**ఐపీఎల్ 2026 ఫైనల్‌లో గుజరాత్ టైటాన్స్‌తో తలపడనున్న ఆర్సీబీ**

**ఫైనల్ కూడా మామూలు మ్యాచేనని వ్యాఖ్యానించిన కెప్టెన్ రజత్ పాటిదార్**

**గతేడాది టైటిల్ గెలిచిన మైదానంలోనే ఫైనల్ ఆడనుండటంతో ఆత్మవిశ్వాసం**

**ఒత్తిడిలో ఉన్నప్పుడు సింపుల్‌గా ఆలోచించాలని సూచించిన కోచ్ ఆండీ ఫ్లవర్**

**వరుసగా రెండోసారి టైటిల్ గెలిచి చరిత్ర సృష్టించాలని చూస్తున్న బెంగళూరు**

ఐపీఎల్ 2026 ఫైనల్ సమరానికి ముందు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) కెప్టెన్ రజత్ పాటిదార్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆదివారం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో గుజరాత్ టైటాన్స్‌తో జరగబోయే టైటిల్ పోరును ఒక 'మామూలు గేమ్'గానే పరిగణిస్తున్నామని, ఎలాంటి ఒత్తిడికి లోనవడం లేదని స్పష్టం చేశాడు. డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగుతున్న తమ జట్టు పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉందని తెలిపాడు.

ఈ సీజన్‌లో ఆర్సీబీ అద్భుతమైన ఫామ్‌ను కొనసాగించింది. లీగ్ దశలో టేబుల్ టాపర్‌గా నిలిచి, క్వాలిఫయర్ 1లో గుజరాత్ టైటాన్స్‌పై 92 పరుగుల భారీ తేడాతో గెలిచి నేరుగా ఫైనల్‌కు అర్హత సాధించింది. ఫైనల్ నేపథ్యంలో ఆర్సీబీ విడుదల చేసిన ఓ వీడియోలో పాటిదార్ మాట్లాడాడు. "వరుసగా రెండోసారి ఫైనల్ ఆడుతుండటం, అదీ గతేడాది కప్ గెలిచిన ఇదే మైదానంలో కావడం చాలా సంతోషంగా ఉంది. గతేడాదికి సంబంధించిన ఎన్నో మధుర జ్ఞాపకాలు ఇక్కడ ఉన్నాయి. ఇది ఫైనల్, పెద్ద వేదిక అని తెలుసు. కానీ నా వరకు ఇదొక సాధారణ మ్యాచ్ మాత్రమే" అని అన్నాడు.




భారీ అంచనాలున్న మ్యాచ్‌ను కూడా సాధారణ మ్యాచ్‌లాగే తీసుకోవడం తనకు అలవాటని పాటిదార్ వివరించాడు. "నేను ఎప్పుడూ వర్తమానంలో ఉండటానికే ప్రయత్నిస్తాను. ఇది ఫైనల్ కదా, ఏం జరగబోతోంది, ఫలితం ఎలా ఉంటుంది అనే విషయాల గురించి ఎక్కువగా ఆలోచించను. ఫలితంతో సంబంధం లేకుండా ప్రశాంతంగా ఉండాలనుకుంటున్నాను" అని తన ఆలోచనా విధానాన్ని పంచుకున్నాడు. ఈ టోర్నమెంట్‌లో ఇప్పటివరకు జట్టుగా ఆడిన తీరు గర్వంగా ఉందని, ప్రతీ ఒక్కరూ జట్టు కోసం తమ వంతు కృషి చేశారని కొనియాడాడు.

కోచ్ ఆండీ ఫ్లవర్ కూడా కెప్టెన్ మాటలతో ఏకీభవించాడు. "వరుసగా ఫైనల్స్‌కు చేరడం గొప్ప విషయం. ఇక్కడికి చేరుకోవడానికి కుర్రాళ్లు చాలా కష్టపడ్డారు. ఈ లీగ్‌లో టేబుల్ టాపర్‌గా నిలవడానికి ఎంతో ధైర్యం కావాలి. అయితే, ఇంకా చేయాల్సింది మిగిలే ఉంది" అని అన్నాడు. ఒత్తిడి పెరిగినప్పుడు విషయాలను సింపుల్‌గా ఆలోచించడం మంచిదని, ఫైనల్‌లో ఆటగాళ్లు అదే వ్యూహంతో బరిలోకి దిగుతారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశాడు.

మరి కొన్ని గంటల్లో గుజరాత్ టైటాన్స్‌తో జరిగే ఫైనల్‌లో గెలిచి, వరుసగా రెండోసారి టైటిల్ సాధించి, ఐపీఎల్ చరిత్రలో ఈ ఘనత సాధించిన

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449 Email;prajaabalamnews@gmail.com